సాక్షి 24|7
విజయనగరం
శనివారం 6-1-2018

నన్నెవరూ మోసం చేయలేరు

- పింఛన్ల కోసం వయసు మార్చేస్తున్నారు
- ఆంధ్రాలోనే విద్యార్థుల ఆత్మహత్యలు తక్కువ
- అయినా పిల్లల బాధ్యత తల్లిదండ్రులదే
- బొబ్బిలి జన్మభూమి–మావూరు సభలో సీఎం చంద్రబాబు
- పిల్లల్ని కని జనాభా పెంచాలని రాష్ట్ర ప్రజలకు పిలుపు

సాక్షిప్రతినిధి, విజయనగరం:

'ఎవ్వరూ నన్ను మోసం చేయలేరు. పింఛను కోసం వయస్సును మార్చేసుకుంటున్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ హయాంలో దెయ్యాలు శ్మశానం నుంచి వచ్చి పింఛన్లు తీసుకుని తిరిగి శ్మశానానికి వెళ్లిపోయేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.' అని సీఎం చంద్రబాబు అన్నారు. ఐదో విడత జన్మభూమి–మావూరు కార్యక్రమంలో భాగంగా బొబ్బిలి లో శుక్రవారం నిర్వహించిన సభలో ముఖ్య మంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భవిష్యత్‌లో విద్య విషయంలో అన్ని విధాలుగా విజయనగరం

- మిగతా 6వపేజీలో ▶



జన్మభూమి సభను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో మంత్రులు సుజయ్, గంటా, జెడ్పీ చైర్‌పర్సన్ స్వాతిరాణి తదితరులు

మళ్లీ మళ్లీ... అవే హామీలు

జిల్లాలో తోటపల్లి ప్రాజెక్టు పూర్తి చేశామని సీఎం తెలిపారు. భోగాపురంలో ఎయిర్‌పోర్టు నిర్మిస్తే విజయనగరం చరిత్ర మారిపోతుందని చెప్పారు. చీపురుపల్లిలో వెటర్నరీలో కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభిస్తామనీ, కురుపాంలో ఉద్యాన వన కళాశాలలో తరగతులు ప్రారంభమయ్యాయనీ తెలిపారు. విజయనగరం–పాలకొండ రహదారిని ఆరు రోడ్ల మార్గంగా చేస్తామన్నారు. గిరిజన యూనివర్శిటీ కోసం ఈ సెషన్‌లో బిల్లు పెడతామన్నారు. జిల్లాలో 25 వేల పంప్‌సెట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు.

అంకెలు... నివేదికలు...

పాతహామీలే మళ్లీ... మళ్లీ వల్లెవేసిన వైనం

స్వామిభక్తి... ముఖస్తుతికే ప్రాధాన్యం

జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన తీరు తెన్ను...

ఎమ్మెల్యేలను వెనక్కు వెళ్లిపొమ్మన్న సీఎం

చిన్నారులతో పొగడ్తలు... వారికి సన్మానాలు

విసుగు చెంది సభ మధ్యలోనే వెనుదిరిగిన మహిళలు

సాక్షిప్రతినిధి, విజయనగరం/బొబ్బిలి:

రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాకు వచ్చారంటే స్థానికంగానే కాకుండా జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున హామీలు, వరాల జల్లు ఉంటుందని భావించడం సహజం. కానీ జిల్లాకు శుక్రవారం వచ్చిన ఆయన కొత్తగా హామీలేమీ ఇవ్వకుండా పాత హామీలనే మళ్లీ మళ్లీ వల్లెవేశారు. ఐదో విడత జన్మభూమి–మావూరు కార్యక్రమంలో భాగంగా బొబ్బిలిలో శుక్రవారం నిర్వహించిన సభలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మధ్యాహ్నం 2.15 గంటలకు వేదికపైకి వచ్చారు. జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ జిల్లా ప్రగతి ప్రసంగం చేసి నేరుగా చంద్రబాబుకు మైకు అందించారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు రూపొందించిన ఆ నివేదికను యధాతథంగా సీఎం చదివి వినిపించారు. ప్రసంగమంతా గణాంకాలు, నివేదికల సమూహమే తప్ప ఏ విధంగానూ ఆకట్టుకోలేకపోయింది. బొబ్బిలి నియోజకవర్గానికి అరకొర హామీలు మినహా జిల్లాకు కొత్తగా ఒక్క హామీయైనా ఇవ్వలేదు. చాలా మంది ప్రజలు వేదిక వద్ద ఏర్పాటు చేసిన టెంట్‌లోకి

- మిగతా 2వపేజీలో ▶

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నరసింగరావు

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, అమరావతి: విజయనగరం, కడప జిల్లాల గ్రంథాలయ సంస్థలకు పాలకవర్గాలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఈ ఉత్తర్వులు ఇచ్చింది. విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థకు చైర్మన్‌గా బి.ఎస్.ఎస్.వి.నరసింగరావును నియమించారు. సభ్యులుగా తప్పెట ప్రసాదరావు, కోయినేని రమణ, మండల రమణ మోహనరావు, మజ్జి చిరంజీవి(సాలూరు), రెడ్డి వెంకన్న, గంట్యాడ శ్రీదేవిలను నియమించారు.

దళితులపై టీడీపీ వర్గీయుల దాడి



డెంకాడ మండలం మోదవలసలో జన్మభూమి సభలో అధికారులకు ఇవ్వడానికి అర్జీలు రాయిస్తున్న దళితులపై గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు దాడిచేసి గాయపర్చారు. ఆస్పత్రికి తరలిస్తున్న వారికి తోడుగా వెళ్తున్నవారిపైనా దాడి చేశారు.

- మెయిన్‌లో...

- ✔ ప్రభుత్వ పాఠశాలలపై సర్కారు సవతితల్లి ప్రేమ
- ✔ మరుగుకూ... మంచినీటికి బయటకు వెళ్లాల్సిందే...
- ✔ మరుగుదొడ్లున్నా.. రన్నింగ్ వాటర్ కరువు
- ✔ నిర్వహణకు వెంటాడుతున్న నిధుల సమస్య
- ✔ నిరంతరం చైతన్యం కల్పించే చిన్నారులకే ఇక్కట్లు

ఆత్మగౌరవానికి అవరోధం!

చిట్టిగురువులు... ఈ కార్యక్రమం ద్వారా శతశాతం అక్షరాస్యత సాధించడానికి దోహదపడేది బడి పిల్లలే. గ్రామాల్లో బహిరంగ మలవిసర్జన వల్ల కలిగే అనర్థాలపై చైతన్యం కలిగించేది బడిపిల్లలే. ఇలా ఏ కార్యక్రమానికైనా వారినే పావులుగా వాడుకునే పాలకులు వారు చదువుకుంటున్న పాఠశాలలో మరుగుదొడ్ల సౌకర్యం కల్పించడంలో నిర్లక్ష్యం చూపిస్తోంది. ఏదో నిర్మించినా... వాటికి రన్నింగ్ వాటర్ సౌకర్యం లేకుండా చేస్తోంది. కొన్ని పాఠశాలల్లో తాగునీటికీ సమస్యలు ఎదురవుతున్నాయి. మరి వారికి ఆత్మగౌరవం ఉండదా... వారూ అత్యవసర వేళ ఆరుబయటకే వెళ్లాలా...?



విజయనగరం పట్టణంలోని 39వ వార్డు పరిధిలో శాంతినగర్ ఉర్దూ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 40 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయినులు ఉన్నారు. ఇక్కడ మరుగుదొడ్ల నిర్మించలేదు.

విజయనగరం అర్బన్:

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 3,034 పాఠశాలలుండగా ఇప్పటికీ మరుగుదొడ్లు నిర్మించని పాఠశాలలు 102 వరకు ఉన్నాయి. జిల్లా కేంద్రం విజయనగరం పట్టణ పరిధిలోని రెండు పాఠశాలలకు ఇప్పటికీ మరుగుదొడ్ల నిర్మాణానికి నోచుకోలేదు. చాలా పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం కూడా లేదు. ఆ రెండింటికీ విద్యార్థులు బయటకు వెళ్లాల్సివస్తోంది. తాజాగా బహిరంగ మలవిసర్జన రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో చేపడుతున్న నిర్మాణాలకు బడి పిల్లలనే చైతన్యవారధులుగా వినియోగిస్తున్నారు. కానీ ఆ పిల్లలుండే బడుల్లో మాత్రం మరుగుదొడ్లు నిర్మించడం లేదు. సీతానగరం మండలం

- మిగతా 2వపేజీలో ▶

అంకెలు... నివేదికలు...

▶ మొదటి పేజీ తరువాయి

వెళ్లలేకపోవడంతో ఎండలో ఉంటూ ఈ ప్రసంగాన్ని వినలేక పోయారు. ఎంతకీ ప్రసంగం పూర్తికాకపోవడంతో చాలా మంది కుర్చీలు ఖాళీ చేసి వెళ్లిపోగా, అక్కడే ఉన్నవారు నిద్ర లోకి జారుకున్నారు.

వెనక్కి వెళ్లిపోయిన ఎమ్మెల్యేలు

ముఖ్యమంత్రి బహిరంగ సభ వేదికపై ప్రధాన నాయకులు పల్చబడ్డారు.హెలీపాడ్ వద్ద సీఎంకు స్వాగతం పలికేందుకు వెళ్లిన గజపతినగరం, విజయనగరం, పార్వతీపురం ఎమ్మెల్యేలు కేఏ నాయుడు, మీసాల గీత, బొబ్బిలి చిరంజీవులుపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గాల్లో జన్మభూమి కార్యక్రమాలు నిర్వహించుకోకుండా తన సభకు ఎందుకొచ్చారని చిర్రుబుర్రులాడుతూ, వెంటనే వెళ్లిపొమ్మని ఆదేశించారు. దీంతో వారు బహిరంగ సభకు హాజరు కాకుండానే అలిగి వెళ్లిపోయారు. అలాగే సీఎంకు ఆమడదూరంలో కూర్చున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు కూడా సభ మధ్యలోనే వెళ్లిపోయారు. సీఎం సభకు బయలుదేరిన ఎస్‌కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తన తోటి ఎమ్మెల్యేలపై సీఎం ఆగ్రహించిన విషయం తెలుసుకుని మార్గమధ్యం నుంచే వెనుదిరిగి వెళ్లిపోయారు. జిల్లాలో ఇద్దరు మంత్రులూ రాజులే! ఏ సభలోనైనా కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు గూర్చి ప్రస్తావించేవారు. కానీ ఈ సారి మంత్రులు గానీ, ముఖ్యమంత్రి గానీ అశోక్ పేరు ప్రస్తావించకుండానే ప్రసంగాలు ముగించారు.

స్వామి భక్తి... ముఖ స్తుతి!

ముఖ్యమంత్రి వేదికపై ఉన్న సమయంలో చిన్నారులు, విద్యార్థులతో ఆయనను పొగడ్తలతో ముంచెత్తడానికి అధికారులు చాలానే కష్టపడ్డారు. జిల్లాలో మరుగుదొడ్ల నిర్మాణం కేంద్ర ప్రభుత్వ పథకమే. దానినే జిల్లా కలెక్టర్ ప్రాధాన్యతాంశంగా తీసుకుని చేస్తున్నారనేది కాదనలేని సత్యం. కానీ చంద్రబాబే మరుగుదొడ్ల పథకం పెట్టారంటూ చిన్నారుల చేత పొగిడించారు. వారిచేత సీఎం కాళ్లకు మొక్కించడం, సీఎం వారికి సత్కారాలు చేయడం హాస్యాస్పదంగా మారింది. అలాగే బొబ్బిలి నియోజకవర్గానికి మంత్రి సుజయ్ కోరిన అభివృద్ధి పనులను సీఎం చేసేస్తానంటూ హామీ ఇచ్చినపుడు మున్సిపల్ **చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి ఏకం**గా పాదాభివందనం చేయడం విశేషం. తనను పొగిడిన విద్యార్థులు గొల్లపల్లికి చెందిన హర్షిణి, జి సిగడాంకు చెందిన చాందినిలకు రూ.50వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయిస్తున్నట్టు సీఎం ప్రకటించారు. బాల కార్మికులనేవారే ఉండకూడదని సీఎం చెప్పగా సభకు వచ్చిన వారికి బాలలచేతే వాటర్ బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంచిపెట్టడం, కుర్చీలు సర్దించడం విశేషం. జిల్లా అధికారుల్లో కొందరైతే ఏకంగా టీడీపీ కార్యకర్తల అవతారమెత్తి సీఎంను పొగడ్తలతో ముంచెత్తారు. సీఎంను స్తుతిస్తూ పాటలు కూడా పాడారు.

కార్యక్రమంలో మంత్రులు గంటా శ్రీనివాసరావు, ఆర్.వి.సుజయకృష్ణ రంగారావు, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ఎమ్మెల్యేలు పతివాడ నారాయణస్వామి నాయుడు, కిమిడి మృణాళిని, ఎమ్మెల్సీలు గుమ్మడి సంధ్యారాణి, ద్వారపురెడ్డి జగదీష్, గాదె శ్రీనివాసులనాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మహంతి చిన్నంనాయుడు, జెడ్పీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, బొబ్బిలి మున్సిపల్ చైర్‌పర్సన్ అచ్యుతవల్లి, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి తూముల భాస్కరరావు, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు శోభా హైమావతి, రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కొయ్యాన శ్రీవాణి, జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్, జేసీ శ్రీకేష్ లఠ్కర్, ఐటీడీఏ పీఓ లక్ష్మీశా తదితరులు పాల్గొన్నారు.


పిల్లలే సేవలకులైన తీరు


నేతల ప్రసంగాల సమయంలో ఖాళీ అయిన కుర్చీలు

ఆత్మగౌరవానికి అవరోధం!

▶ మొదటి పేజీ తరువాయి

గాదిలవలస ఉన్నతపాఠశాలలో 540 మంది విద్యార్థులున్నారు. వారికి ఒకే ఒక మరుగుదొడ్డి నిర్మించారు. మరోవైపు దానికి రన్నింగ్ వాటర్‌లేదు. దూర ప్రాంతం నుంచి బకెట్లతో వాడుక నీటిని తెచ్చుకోవాలి. ఇలాంటి పాఠశాలలు 60 శాతం వరకు జిల్లాలో ఉన్నాయి.


రన్నింగ్ వాటర్‌లేక వినియోగానికి దూరంగా గాదిలవలస ఉన్నత పాఠశాల మరుగుదొడ్లు

ప్రభుత్వ పాఠశాలలంటే చిన్నచూపు

ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపిస్తోంది. తాగు నీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాల్సిందేనని గత ఏడాది సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోంది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినప్పటికీ నిర్వాహణ లోపాలను సరిదిద్దుకోవాలని ఇటీవల జిల్లాలో పర్యటించిన సుప్రీం కోర్టు బృందం సూచనలతో కూడిన ఆదేశాలిచ్చింది. అదే విధంగా పాఠశాలల్లోని తాగు నీరు, మరుగుదొడ్ల నిర్వాహణ కోసం నెలవారీ నిధులివ్వాలని సూచించింది. జిల్లాలోని అన్ని పాఠశాలలను ఒకేలా చూడకుండా నిర్దేశిత విద్యార్థులున్న పాఠశాలలకు మాత్రమే నిర్వహణ నిధులు ఇస్తూ పక్షపాతం చూపిస్తోంది. నిధులు కేటాయించని పాఠశాలలను రానున్న రోజుల్లో వివిధ కారణాలతో మూసివేసే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్‌లో చెప్పిన మాటలు బట్టి చూస్తే ఆ అనుమానాలు బలపడుతున్నాయి. ప్రాథమికవిద్య స్థాయిలో తక్కువ విద్యార్థులున్న పాఠశాలల్ని మూసేసి వాటికి బదులుగా మండలానికి మూడు వసతిగృహాలతో కూడిన పాఠశాలలను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామని ప్రకటించారు. దీనిపై ఇప్పటికే ఉపాధ్యాయ వర్గాలు వ్యతిరేకిస్తున్నారు.

- విజయనగరం 6వ వార్డు పరిధిలోని హుకుంపేట ప్రాథమిక పాఠశాలలో 25 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయినులు ఉన్నారు. ఇక్కడ కూడా మరుగుదొడ్లులేవు. మరుగుదొడ్లు నిర్మించమని పలుమార్లు అధికారులకు చెప్పుకున్నా పట్టించుకోలేదు'.
- బలిజిపేట మండలం నారాయణపురం ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు లేకపోవడంతో గలావల్లి మాధురి అనే విద్యార్థిని గత అక్టోబర్ ఐదో తేదీన బడికి సమీపంలోని నదికి బహిర్భూమికోసం వెళ్లి ప్రమాదవశాత్తూ ఆ నదిలో కొట్టుకుపోయింది.

ఇవీ పాఠశాలల్లో మరుగుదొడ్లు లేకపోవడంవల్ల తలెత్తుతున్న సమస్యలు. ఇలాంటి పాఠశాలలు జిల్లా వ్యాప్తంగా 102 వరకు ఉన్నాయి. మరోవైపు నిర్మించిన మరుగుదొడ్లు విద్యార్థుల సంఖ్యకు సరిపడేలా లేక, రన్నింగ్ వాటర్ సౌకర్యం లేక 60 శాతం వరకు వినియోగానికి దూరంగా ఉన్నాయి.

కేటాయించారు సరే... విడుదల చేయరేం?

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో తాగు నీరు, మరుగుదొడ్ల నిర్వహణ కోసం సర్వ శిక్షాభియాన్ జిల్లాకు సుమారు రూ. కోటి నిధులను మంజూరు చేసింది. ఆరు మాసాలు దాటినప్పటికీ ప్రభుత్వం ఆ నిధుల్ని మంజూరు చేయలేదు. విద్యార్థుల సంఖ్యను కొలమానంగా తీసుకొని నెలవారీ నిర్వాహక నిధులు కేటాయించారు. ప్రాథమిక పాఠశాలల్లో 60 మంది విద్యార్థులు దాటితే రూ. 1000, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 100 మంది విద్యార్థులుంటే వాటికి రూ.1500లు, ఉన్నత పాఠశాలల్లో 150 మంది విద్యార్థులు దాటితే రూ.2,500లు నెలవారీ నిర్వహణ ఖర్చులు మంజూరు చేశారు. కానీ వాటిని విడుదల చేయకపోవడంతో నిర్వహణ ఎలా సాధ్యమని సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు వాపోతున్నారు.

అన్ని పాఠశాలలకు నిధులివ్వాలి

మరుగుదొడ్లు, తాగునీటి సదుపాల నిర్వహణ కోసం అన్ని పాఠశాలకు నిధులు కేటాయించాలి. పిల్లల సంఖ్యను బట్టి మౌలిక సదుపాయాల నిధులు కేటాయించాలనే నిబంధన ఏ చట్టంలో లేదు. అన్ని పాఠశాలలకూ మరుగుదొడ్ల నిర్వహణకు నిధులివ్వాల్సిందే.

– టి.సన్యాసిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రధానోపాధ్యాయుల సంఘం.

ఇంకా 43 స్కూళ్లకు మరుగుదొడ్లు నిర్మించాలి

జిల్లాలో 43 పాఠశాలలకు ఇంకా మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. మరో 100 వరకు పూర్తిగా మరమ్మతు చేయాలి. వీటి నిర్మాణ పనుల కోసం కలెక్టర్ అనుమతిచ్చారు. త్వరలో వాటి పనులు పూర్తి చేస్తాం. రన్నింగ్ వాటర్ లేని కారణంగా పలు పాఠశాలల్లో వినియోగించడంలేదు. నిర్వహణ నిధులు ఇంకా విడుదల కావాల్సి ఉంది.

– ఎస్.లక్ష్మణరావు, పీఓ, ఎస్ఎస్ఏ

అంత్యక్రియలకు వెళ్లొస్తూ...

మేనమామ అంత్యక్రియలకు వెళ్లొస్తూ ప్రమాదవశాత్తు వాహనం నుంచి జారిపడి ఓ గిరిజనుడు మృత్యువాత పడ్డాడు. దీంతో ఆ కుటుంబంలో రోదనలు మిన్నంటాయి. అంత్యక్రియలకు వెళ్లొస్తాడని ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులకు మృతదేహం రావడంతో గొల్లుమన్నారు. వివరాల్లోకి వెళ్తే...

- బొలేరొ వాహనం నుంచి జారిపడి గిరిజనుడి మృతి
- మేనమామ దహన సంస్కారాలకు వెళ్లొస్తూ...


ఆసు మృతదేహం

కురుపాం: బొలేరొ పికప్ వాహనం నుంచి జారి పడి ఓ గిరిజనుడు మృత్యువాత పడిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే...కురుపాం మండలం గుమ్మిడి గూడ పంచాయతీ గుజ్జల గండ గ్రామానికి చెందిన తిమ్మక ఆసు (34) గుమ్మలక్ష్మీపురం మండలం కానసింగి గ్రామంలో తన మేన మామ ఇటీవల మృతి చెందటంతో జరిగిన అంత్యక్రియలకు గురువారం హాజరయ్యాడు. తిరుగు ప్రయాణంలో సాయంత్రం బొలేరొ పికప్ వాహనంలో వస్తుండగా కొత్తవలస గ్రామ సమీపంలో ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అదే వాహనంలో స్థానికులు కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొని రాగా వైద్య సేవలు అందించారు. తలకు తీవ్ర గాయం కావడంతో గురువారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన తిమ్మక ఆసుకు భార్య రాధమ్మతో పాటు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరామర్శ

గుమ్మిడిగూడ పంచాయతీ జెడ్పీటీసీ శెట్టి పద్మావతి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికారి ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావుల సొంత పంచాయతీ కావడంతో వెంటనే ఆసుపత్రికి వెళ్లి ఆసు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాద వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

భోగాపురం: స్థానిక ఎస్‌బీఐ కూడలి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే... స్థానిక హోటల్‌లో పని చేస్తున్న సుబ్బారావు(65) రాత్రి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో సుబ్బారావు అక్కడిక్కడే మరణించాడు. హెచ్‌సీ గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సుబ్బారావు మృతదేహం

విద్యార్థుల కొట్లాట


పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేస్తున్న మిరాకిల్ కళాశాల విద్యార్థులు

భోగాపురం : మండలంలోని మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగంలో సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య శుక్రవారం వివాదం నెలకొంది. అది కాస్త కొట్లాటకు దారి తీసింది. దీంతో వారంతా శుక్రవారం సాయంత్రం పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. పాఠశాలలో అధ్యాపక సిబ్బంది కూడా రెండు గ్రూపులుగా ఏర్పడి విద్యార్థులకు మద్దతు ఇస్తున్నట్లు వారు పోలీసులకు తెలిపారు. ఎస్ఐలు సీఎం బందోబస్తుకి వెళ్లిపోవడంతో శని వారం పరిశీలన చేస్తామని సిబ్బంది విద్యార్థులకు చెప్పి పంపించేశారు.

మూగ యువతిపై అత్యాచారయత్నం

- అడ్డుకోబోయిన తండ్రిపై కత్తితో దాడి
- తండ్రికి తీవ్ర గాయాలు

బొండపల్లి: మూగ యువతిపై ఓ యువకుడు అత్యాచారయత్నం చేసిన ఘటన మండలంలో గురువారం అర్ధరాత్రి గొట్లాం గ్రామంలో చోటు చేసుకుంది. బొండపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొట్లాం గ్రామంలోని హరిజనవాడలో పూరిగుడిసెలో చొరబడి నిద్రపోతున్న యువతిపై అదే గ్రామానికి చెందిన కొలుసు పైడిరాజు అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. యువతి తండ్రి వెంటనే మేల్కొని పైడిరాజును తీవ్రంగా మందలించాడు. దీంతో వెనుదిరిగిన పైడిరాజు తన తమ్ముడు కొలుసురామును వెంటపెట్టుకొని మళ్లీ అత్యాచారయత్నానికి చొరబడ్డాడు. దీనిని యువతి తండ్రి ప్రతిఘటించడంతో పైడిరాజు తనతో తెచ్చుకున్న కత్తితో దాడిచేశాడు. దీంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు 108 వాహనంపై విజయనగరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బొండపల్లి ఎస్ఐ సుదర్శన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం పర్యటనలో టీవీ కెమెరామెన్‌కు గుండె పోటు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రకాష్

బొబ్బిలి: సీఎం పర్యటనలో భాగంగా పట్టణంలో హెలీపాడ్ నుంచి వస్తున్న విలేకర్ల బృందంలోని ఓ టీవీ కెమెరామెన్ సూర్యప్రకాష్‌కు శుక్రవారం ఆకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. దీంతో విలేకర్లు కాన్వాయ్‌లో ఉన్న అంబులెన్స్‌ను ఇవ్వమని కోరగా సీఎం కాన్వాయ్‌లో ఉన్న అంబులెన్స్ ఇవ్వకూడదని, బాడంగి లేదా బొబ్బిలి ఆసుపత్రులకు ఫోను చేస్తే అంబులెన్స్ వస్తుందని అధికారులు ఉచిత సలహా ఇచ్చారు. దీంతో అక్కడ పరిస్థితి చేయిదాటిపోయే పరిస్థితి ఉత్పన్నమయింది. అయితే అక్కడి నుంచి డీసీహెచ్‌ఎస్ ఉషశ్రీ చర్యలు తీసుకోవడంతో ప్రైవేటు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించగలిగారు. బొబ్బిలి ఆసుపత్రిలో కూడా కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. బొబ్బిలి ఆసుపత్రిలో ఫిజిషియన్ లేకపోవడంతో పాటు జనరేటర్ సదుపాయం కూడా లేదు. దీంతో కెమెరామెన్‌ను కాపాడుకునేందుకు పలు అవస్థలు పడాల్సి వచ్చింది. అక్కడి నుంచి విజయనగరంలోని తిరుమల ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగానే ఉందని సహచర మీడియా ప్రతినిధులు తెలిపారు. సీఎం కాన్వాయ్‌లో రెండు, సభ దగ్గర కొన్ని అంబులెన్స్‌లు ఉన్నా గుండెపోటు వచ్చిన వారికి మాత్రం అంబులెన్స్‌లు ఇవ్వని తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములకు గాయాలు

రామభద్రపురం: మండల కేంద్రంలోని కొత్తగా నిర్మిస్తున్న సినిమా హాలు వద్ద శుక్రవారం ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొన్న ఘటనలో అన్నదమ్ములకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు... విజయనగరం మండలం కొండరకాం గ్రామానికి చెందిన పెంకి దాస్‌కుమార్, ఆయన అన్నయ్య కృపారావు కలసి ద్విచక్ర వాహనంపై బొబ్బిలి తమ బంధువుల ఇంటికి పరామర్శించడానికి వెళ్తుండగా మండల కేంద్రంలోని కొత్తగా నిర్మిస్తున్న సినిమా హాలు వద్దకు వచ్చే సరికి సినిమా హాలులో ఇసుకను అన్‌లోడ్ చేసి రోడ్డుపైకి వస్తున్న టిప్పర్ ఢీకొంది. ఇద్దరికి బలమైన గాయాలు కాగా చికిత్స నిమిత్తం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హెచ్‌సీ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం

గరివిడి : మండలంలోని కోనూరు గ్రామానికి చెందిన నరముల అసిరప్పడు (50) శుక్రవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు అందించిన సమాచారం మేరకు అసిరప్పడు మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో తగాదా పడేవాడు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగినట్టు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం విజయనగరంలోని మహరాజ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

భార్యపై హత్యా యత్నం


సాలూరు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న ఆదమ్మ

సాలూరు రూరల్: కట్టుకున్నవాడే అనుమానించి భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పాచిపెంట మండలంలోని మోసూరు పంచాయతీ గంగందొరకోనవలసలో శుక్రవారం చోటు చేసుకొంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు...గ్రామానికి చెందిన పాడి ఆదమ్మ(22)పై అనుమానంతో భర్తే శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లోనే కత్తితో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన స్థానికులు ఆమెను 108లో సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనో వేదనే...ప్రాణం తీసిందా!


పాలకొండ ఏరియా ఆస్పత్రిలో సీతంనాయుడు మృతదేహం

పాలకొండ రూరల్/పాలకొండ: రాజాం పట్టణంలో నవ్యనగర్ కాలనీకి చెందిన కలిపిండి సీతంనాయుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆస్తి వివాదం కారణంగా గత నెల 28న తన స్వగృహంలో నిద్రిస్తున్న కన్న కుమారుడు శ్రీకాంత్ నాయుడును కత్తితో నరికాడు. ఈ ఘటనలో శ్రీకాంత్‌నాయుడు మరణించాడు. దీంతో నిందితుడు సీతంనాయుడును పోలీసులు అదుపులోకి తీసుకుని రాజాం కోర్టులో హాజరుపర్చగా ఆయనకు రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. రిమాండ్‌లో భాగంగా ఈ నెల 1న సీతంనాయుడును పాలకొండ సబ్‌జైల్‌కు తరలించారు. ఈ క్రమంలో సబ్‌జైల్లో ఉన్న సీతంనాయుడు ఆ రోజు నుంచి మనోవేదనతో ఉన్నట్టు జైలు సిబ్బంది చెబుతున్నారు. సక్రమంగా భోజనం చేయకపోవటంతో పాటు చనిపోయిన కుమారుడిని తలచుకొని మథనపడుతుండేవాడని తోటి ముద్దాయిలు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో సీతంనాయుడు ఆరోగ్యం దెబ్బతిని శ్వాస సంబంధిత వ్యాధికి గురయ్యాడు. దీంతో ఈ నెల 4వ తేదీ గురువారం జైలు సూపరింటెండెంట్ వి.వెంకటరమణ తన సిబ్బందితో కలిసి పాలకొండ ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యసేవలు చేయించి తిరిగి జైలుకు తీసుకొచ్చారు. అక్కడ కూడా సీతంనాయుడు తన అనారోగ్యానికి కారణం నేరం చేశానన్న మనోవేదనేనని చెప్పినట్టు వైద్యులు అంటున్నారు. అయితే ఇదే రోజు రాత్రి సబ్‌జైలులో సీతంనాయుడు తీవ్ర అస్వస్థతకు గురవటంతో మళ్లీ అర్ధరాత్రి స్థానిక ఆస్పత్రికి తీసుకువెళ్లినట్టు జైలు సూపరింటెండెంట్ తెలిపారు. అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

మృతిపై అనుమానాలు

ఇదిలా ఉంటే సీతంనాయుడు మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈయన గుండెపోటుతో చనిపోయారా లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా అన్న అనుమానాలు శుక్రవారం అంతా చక్కర్లు కొట్టాయి. పోస్టుమార్టం నివేదిక అందితే తప్ప పూర్తి స్థాయి వాస్తవాలు చెప్పలేమని వైద్యులు పేర్కొంటున్నారు.


సాయంత్రానికి చేరుకున్న భార్య

సీతంనాయుడు మృతదేహం ఆస్పత్రి మార్చురీలో ఒంటరిగా మిగిలింది. చనిపోయిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసినప్పటికీ వారెవరు సాయంత్రం వరకు మృతదేహం వద్దకు వచ్చేందుకు అంగీకరించలేదు. దీంతో అటు పోలీసులు, ఇటు జైలు సిబ్బంది తర్జనభర్జన పడ్డారు. ఎట్టకేలకు శుక్రవారం సాయంత్రం మృతుని భార్య సరోజిని రావటంతో పాలకొండ న్యాయస్థానం ఇన్‌చార్జి న్యాయమూర్తి కిరణ్ ఆధ్వర్యంలో డీఎస్పీ జి.స్వరూపారాణి, ఆర్డీవో రెడ్డి గున్నయ్య, సీఐ సూరినాయుడు సమక్షంలో శవపంచనామా పూర్తి చేసి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగిస్తామని అధికారులు పేర్కొన్నారు.

భవిష్యం

మేషం: ముఖ్య నిర్ణయాలలో మార్పులు వచ్చే అవకాశం ఉంది. అనుకోని ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. దైవ దర్శనాలు చేసుకుంటారు. వృత్తి, వ్యాపారాలు మందగిస్తాయి.

వృషభం: పనుల్లో స్వల్ప అవరోధాలు. ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. ఆరోగ్య భంగం. రుణాలు చేయాల్సి వస్తుంది. వ్యాపారాలు, ఉద్యోగాలలో నిరాశ.



మిథునం: బాకీలు వసూలు అవుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. పరిచయాలు పెరుగుతాయి. ఇంటాబయటా అనుకూలం. వ్యాపారవృద్ధి. ఉద్యోగులకు హోదాలు.

కర్కాటకం: కుటుంబ సమస్యలు. ఆస్తి వివాదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలలో ఒడిదుడుకులు.

సింహం: అప్రయత్న కార్యసిద్ధి. పోటీపరీక్షల్లో విజయం. ఆప్తుల నుంచి ఆహ్వానాలు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం. వృత్తి, వ్యాపారాలలో అనుకూల పరిస్థితులు.

కన్య: కొత్త రుణాలు చేస్తారు. దూర ప్రయాణాలు చేసే అవకాశం ఉంది. ఆరోగ్య భంగం. బంధువులతో మాటపట్టింపులు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒత్తిళ్లు.

తుల: ఉద్యోగయత్నాలు కలసివస్తాయి. సంఘంలో గౌరవం. కుటుంబంలో శుభకార్యాలు. ఆర్థికాభివృద్ధి. వృత్తి, వ్యాపారాలు సజావుగా కొనసాగుతాయి.

వృశ్చికం: నూతన ఉద్యోగ యోగం. ముఖ్య నిర్ణయాలు. మీ ఆశయాలు నెరవేరతాయి. స్థిరాస్తి లాభం. వ్యాపారులకు ఊహించని లాభాలు. ఉద్యోగులకు ప్రమోషన్లు.

ధనుస్సు: శ్రమకు ఫలితం కనిపించదు. ఉద్యోగ యత్నాలు నిరాశ కలిగిస్తాయి. ముఖ్యమైన పనులు ముందుకు సాగవు. వ్యాపార, ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి.

మకరం: బంధువుల నుంచి సమస్యలు. ఆర్థిక ఇబ్బందులు. ప్రయాణాలు వాయిదా వేస్తారు. వ్యాపారాలలో గందరగోళం. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి.

కుంభం: కొత్త మిత్రులు పరిచయం అవుతారు. శుభవార్తలు అందుతాయి. వ్యవహారాలలో అనుకూలత. సంఘంలో గౌరవం పెరుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు అధిగమిస్తారు.

మీనం: విద్యార్థులు శుభవార్తలు అందుకునే అవకాశం ఉంది. వ్యవహార విజయం. ఆహ్వానాలు, గ్రీటింగ్‌లు అందుతాయి. దైవ దర్శనాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఉత్సాహవంతంగా ఉంటుంది.

– సింహంభట్ల సుబ్బారావు

సేవలు

సోమవారం	మంగళవారం	బుధవారం	గురువారం	శుక్రవారం	శనివారం	ఆదివారం
సంస్కృతి	రైల్వే	ప్రజావసరాలు	మనకోసం	లైఫ్ స్టైల్	షాపింగ్	రవాణా

ఆర్టీసీ సమాచారం

అడ్వాన్స్ బుకింగ్	:	08922 234911
విచారణ కేంద్రం	:	08922-225333,
వాణిజ్య సమాచారం	:	9704222047
ఫిర్యాదువిభాగం	:	738292372
టోల్ ఫ్రీ నెంబర్	:	1800-200-4599

హోటల్స్ ఫోన్ నంబర్స్

హోటల్ రవిరాజ్	08922-225326, 223338
హోటల్ వైట్లా	08922-272250, 272251
ఎస్‌విఎన్ హోటల్	08922-277770
హోటల్ విజయనగర్	08922-223203
మారుతీ పర్ణశాల	08922-227779
కృష్ణాభవన్	08922-224509
హోటల్ పూర్ణిమ	08922 - 223345
మయూరా	08922 - 223345
హోటల్ బాలాజీ	08922229445,233666
హోటల్ పీకాక్	08922 - 223355
సెంట్రల్ కేఫ్	08922 - 222265
శ్రీ లక్ష్మీవిలాస్	08922 - 223803
హోటల్ మారుతీ	08922 - 226345
హోటల్ బ్లూ ఎర్త్	08922 - 233099

విజయనగరంలో పుస్తకాల షాపులు

వెంకటేశ్వరా బుక్ పాయింట్ :	08922–233634
హిమాంశు బుక్ డిపో :	08922–225422
గుప్త బుక్ డిపో :	9848038041
స్టూడెంట్ ఎంపోరియం :	9885686500
జ్యోతి బుక్ డిపో :	9502020250
సాయి శ్రీదివ్య బుక్ సెంటర్ :	9494640312
మను ఎంటర్ ప్రైజస్ :	9885714043
రవ్వా అప్పలనరసింహులు సన్స్ :	08922–225210
జైన్ బుక్ డిపో :	9811099506
తపస్సు బుక్ డిపో:	9963068913
శ్రీ మణికంఠ బుక్ కార్నర్ :	9030932331
సంతోష్ సంపత్ బుక్ స్టేషన్ :	08922–220023
ప్రకాష్ బుక్ షాప్:	9394743047
ఓల్డ్ ఈజ్ గోల్డ్ బుక్‌షాప్:	9866038154
శ్రీసాయిబాలాజీ బుక్స్ అండ్ స్టేషనరీ :	08922–228498
చిత్తరంజన్ బుక్ సెంటర్ :	08922–224733
సాయిభార్గవి బుక్ డిపో :	08922–220456
శ్రీ శ్రీనివాసా బుక్ డిపో:	9440527071
రవితేజా బుక్ షాప్:	08922–240999
శ్రీ రామా బుక్ సెంటర్:	9849663015

ఎమర్జెన్సీ ఫోన్ నంబర్లు

ఈకాంవెల్ అంబులెన్స్	08942–224142
రెడ్‌క్రాస్ అంబులెన్స్, శ్రీకాకుళం	08942–226555

విజయనగరంలో ఫంక్షన్ హాల్స్ ఫోన్ నంబర్లు

మారుతీ రెసిడెన్సీ	08922 222834
శ్రీలక్ష్మీనారాయణ గార్డెన్ ఫంక్షన్ హాల్	9848683393
హోటల్ వైట్ల రెసిడెన్సీ	08922- 272250
హోటల్ మయూర	08922-235888
శ్రీబాలాజీ ఇంటర్నేషనల్	08922-233666
అనుప్రియ కల్యాణ మండపం	08922-226585
ఎస్‌వీఎన్ లేక్ ప్యాలెస్	08922-277770
కాకతీయ ఫంక్షన్ హాల్	08922-235009
టీటీడీ కల్యాణ మండపం	8922- 222769
ఆర్.కె. ఫంక్షన్ హాల్	9959693355
ఐఎంఏ ఫంక్షన్ హాల్	8179408430
కానుకుర్తివారి సత్రం(లయన్స్ కమ్యూనిటీ హాల్)	08922-235168
నాయుడు ఫంక్షన్ హాల్	9440512342
పి.వి.జి.రాజు క్షత్రియ కల్యాణ మండపం	9703237479, (08922-232323)
మెసానిక్ టెంపుల్	08922-231746
రెవెన్యూ కల్యాణ మండపం	9985177387
లేడీస్ రిక్రియేషన్ క్లబ్	9492855531

రామతీర్థం ఆలయ సమాచారం



రామతీర్థం ఆలయంలో స్వామి వారి పూజలు, దర్శన వివరాలు.. ప్రతిరోజూ వేకువజామున ఐదు గంటలకు ఆలయం తెరిచి 6.30 గంటల వరకు సుప్రభాతం, తీర్థబిందె, శుద్ధి, తిరువారాధన కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం 6.30 నుంచి 7గంటల వరకు బాలభోగం, మంగళాశాసనం కార్యక్రమాలు జరుగుతాయి. అనంతరం 11.30 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు సీతారాముల నిత్యకల్యాణం జరుగుతుంది. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.15 వరకు రాజభోగం ఉంటుంది. మధ్యాహ్నం 12.15 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకు రాత్రిభోగం, మంగళాశాసనం, పవళింపుసేవ కార్యక్రమాలుంటాయి.

- నెల్లిమర్ల

విజయనగరం వాతావరణం

గరిష్టం	కనిష్టం
27.7°	15.5°

నేడు : సన్నగా మంచు కురవొచ్చు. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం చలిగా, మధ్యాహ్నం ఆహ్లాదంగా, రాత్రి నిర్మలంగా ఉండవచ్చు.
గరిష్టం 28డి. కనిష్టం: 15డి.

రేపు : సన్నగా మంచు కురవొచ్చు. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం చలిగా, పగలు ప్రకాశవంతంగా, రాత్రి నిర్మలంగా ఉండవచ్చు.
గరిష్టం 29 డి. కనిష్టం: 15డి.

సోమవారం: గాలులు వీయవచ్చు. సూర్యప్రతాపం కనిపించవచ్చు. ఉదయం చలిగా, మధ్యాహ్నం ఆహ్లాదంగా, రాత్రి నిర్మ లంగా ఉండవచ్చు.
గరిష్టం: 29డి.కనిష్టం:16డి.

ఆస్పత్రి ఫోన్ నంబర్లు

ఆస్పత్రి పేరు	ఫోన్ నంబరు
వెంకటరామ ఆస్పత్రి	08922-236759
సిటిస్కాన్ డయోగ్నోస్టిక్స్	08922-222022
వెంకటాద్రి ఆస్పత్రి	9440018606
సాయి రమ్య ఆస్పత్రి	9440120277
వెంకటపద్మ ఆస్పత్రి	7702612346

చికెన్ ధరలు (బ్రాయిలర్)

లైవ్	డ్రెస్డ్(విత్‌స్కిన్)	స్కిన్‌లెస్
రూ. 95	రూ. 160	రూ. 170

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100)

విశాఖపట్నం	400–00
విజయనగరం	404–00
శ్రీకాకుళం	404–00

బులియన్

విశాఖపట్నం

బంగారం (24కె. 10గ్రా)	30,760
బంగారం (22కె. 10గ్రా)	28,200
వెండి కిలో	39,500

మీకోసం

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల విజేతలు వీరే..

విజయనగరం మున్సిపాలిటీ: ఎలియన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డ్రిస్టిక్ట్ 105 ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమంపై నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల విజేతల వివరాలను క్లబ్ గవర్నర్ సముద్రాల గురప్రసాద్ శుక్రవారం ప్రకటించారు. విజేతలకు 8వ తేదీ ఉదయం 10 గంటలకు ఉడాకాలనీలో గల గురజాడ పాఠశాలలో బహుమతి ప్రదానం జరుగుతుందన్నారు. 7వ తరగతి విభాగంలో ఎ.నందిని(తోటపాలెం గాయత్రి స్కూల్). వి.నితీష్, కె.పూజిత(గురజాడ పాఠశాల). 8వ తరగతి విభాగంలోబి.అఖిల్(మెంటాడఏపీ మోడల్ స్కూల్), జి.జాహ్నవి (శారదా విద్యాపీఠ్), ఎం.చందు ప్రసన్నకుమార్(గురజాడస్కూల్). 9వ తరగతి విభాగంలోధనుకొండ శేషగిరి(రామభద్రపురం జెడ్పీ హైస్కూల్), జి.వాహిని(గురజాడ స్కూల్), కె.భావన(తోటపాలెం గాయత్రి స్కూల్), 10వ తరగతి విభాగంలో టి.జయశ్రీ(గురజాడ స్కూల్), తనియా సింగ్(శారదా విద్యాపీఠ్), ఈ.సూర్య(మెంటాడ ఏపీ మోడల్ స్కూల్) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కై వసం చేసుకున్నారని పేర్కొన్నారు.

టీటీడీ సమాచారం



తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం:

గదుల వివరాలు:

ఉచిత గదులు	–	ఖాళీ లేవు
రూ.50 గదులు	–	ఖాళీ లేవు
రూ.100 గదులు	–	ఖాళీ లేవు
రూ.500 గదులు	–	ఖాళీ లేవు

సేవలు

సహస్ర దీపాలంకరణ	–	ఖాళీ లేవు
వసంతోత్సవం	–	ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం	–	ఖాళీ లేవు

బుల్లితెర


W

SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30	గుడ్ మార్నింగ్
ఉ.07.30	కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.08.00	న్యూస్ ఫీచర్
ఉ.08.30	రీజనల్ న్యూస్
ఉ.09.30	మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.30	న్యూస్ ఫీచర్
ఉ.11.30	పొలిటికల్ కారిడార్
మ.12.00	మూవీ మ్యాటర్స్
సా.04.30	మార్గం
సా.05.00	స్పీడ్ న్యూస్
సా.05.30	ఉర్దూ న్యూస్
సా.06.00	రీజనల్ న్యూస్
రా.08.00	సాక్షి న్యూస్
రా.08.30	బతుకు చిత్రం
రా.09.00	న్యూస్ 360
రా.09.30	జ్యూక్ బాక్స్
రా.10.30	మూవీ మ్యాటర్స్

టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 సిరి సిరి మువ్వ
ఉ.09.30 సీతాకోకచిలుక
మ.12.00 రణధీర
సా.06.00 పెళ్లాంతో పనేంటి
రా.09.00 అదృష్టం



మూవీస్ నౌ
ఉ.10.20 శాన్ ఆండ్రియాస్
మ.12.35 క్యాసినో రాయల్
మ.03.30 ద యాక్సిడెంటల్ స్పై
సా.05.15 ఎపిక్ మూవీ
రా.09.00 జర్నీ 2



హెచ్‌బీవో
ఉ.07.28 ఆల్మోస్ట్ హీరోస్
ఉ.10.41 కొల్లాటరల్ బ్యూటీ
మ.12.27 ద డార్క్ నైట్ రైజెస్
సా.05.16 పుస్ ఇన్ బూట్స్
రా.09.00 ద కంజ్యూరింగ్



స్టార్ మూవీస్
ఉ.06.08 హోటల్ ట్రాన్సిల్వేనియా
ఉ.07.55 బేబీస్ డే ఔట్
మ.01.52 డాక్టర్ స్ట్రేంజ్
సా.04.11 చైనీస్ జోడియాక్
రా.09.00 థోర్ 2: ద డార్క్ వరల్డ్



మా మూవీస్
ఉ.09.30 దడ
మ.12.00 సాహసం
మ.03.00 రక్షణ
సా.06.00 మన్మథుడు
రా.09.00 ఊకొడతారా ఉలిక్కిపడతారా



జీ సినిమా
ఉ.04.45 బాంబే టు బ్యాంకాక్
ఉ.08.14 శివలింగ
ఉ.11.08 తారే జమీన్ పర్
మ.02.28 బాఫీ
రా.11.44 ఖేల్ పవర్ కా

రుణమాఫీ జరగలేదు..

● అయ్యన్నపేట జన్మభూమిలో అధికారులను ప్రశ్నించిన మహిళలు ● పారిశుద్ధ్యాన్ని పట్టించుకోవడం లేదు : వైఎస్సార్‌సీపీ నాయకులు



రూరల్: కోరుకొండలో చేతిపంపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గీత

విజయనగరం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డు అయ్యన్నపేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన 'జన్మభూమి– మా ఊరు' కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు మజ్జి త్రినాథరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు పలు సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు డ్వాక్రా రుణమాఫీ జరగలేదన్నారు. రుణమాఫీ చేయలేనప్పుడు హామీలెందుకు ఇవ్వాలని నిలదీశారు. అలాగే వార్డు పరిధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉన్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ నాయకుడు త్రినాథరావు, తదితరులు సభ దృష్టికి తీసుకువచ్చారు. వీధులతో పాటు ప్రధానరోడ్లపై మురుగునీరు ప్రవహిస్తున్నా అధికారులు గాని స్థానిక కౌన్సిలర్ గాని పట్టించుకోవడం లేదన్నారు. సర్వే నంబర్ 77లో బాపటివాని చెరువులో ఎకరం.. నల్ల మారమ్మ మెట్ట దగ్గర ఉన్న ప్రభుత్వ స్థలం 95/6లో ఐదెకరాలు కబ్జాకు గురయిందని అధికారులకు తెలియజేశారు. జన్మభూమి కమిటీ సభ్యులు సూచించిన వారికే సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారు తప్ప అర్హులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేలిముద్రలు పడకపోవడం వల్ల వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్లు సక్రమంగా అందడం లేదన్నారు. అధికార పార్టీ నాయకుల భూములకు వెళ్లేందుకు సీసీ రోడ్లు వేశారని, ఇది ఎంతవరకు సమంజసమని కాళీఘాట్ కాలనీ వాసులు ప్రశ్నించారు. పాల్‌నగర్‌లో ఉన్న ప్రజా కమ్యూనిటీ భవనాన్ని ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడంతో ఆ ప్రాంత వాసులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, కౌన్సిలర్ సైలాడ అన్నపూర్ణ, ఏఎంసీ చైర్మన్ సైలాడ త్రినాథ్, మున్సిపాలిటీ అధికారులు, అధికార పార్టీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ, కోరుకొండపాలెంలో..

మండల పరిధిలోని కోరుకొండ, కోరుకొండపాలెం గ్రామాల్లో జన్మభూమి సభలు నిర్వహించారు. కోరుకొండలో జరిగిన కార్యక్రమానకి ఎమ్మెల్యే మీసాల గీత ముఖ్య అతిథిగా హాజరై సంక్షేమ పథకాలపై వివరించారు. అనంతరం అర్హులకు పింఛన్లు, రేషన్‌కార్డులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించారు. అలాగే గ్రామంలో ఏర్పాటు చేసిన బోరును కూడా ప్రారంభించారు. అనంతరం సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటమురళి, ఎంపీపీ కెంగువ ధనలక్ష్మి, సర్పంచ్ లగుడు శివాజీ, ఎంపీటీసీ సభ్యుడు బంగారునాయుడు, ఎంపీడీఓ ఎం.శ్రీరామ్మూర్తి, రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.పావని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బర్లి అనురాధ, మండలశాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోరుకొండపాలెంలో...

మండలంలోని కోరుకొండపాలెంలో ఆర్డీఓ వెంకట మురళి ఆధ్వర్యంలో జన్మభూమి సభ జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులకు మంజూరైన ప్రభుత్వ పథకాలను అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తాడ్డి గోవింద్, ఎంపీడీఓ ఎం.శ్రీరామ్మూర్తి, సర్పంచ్ చొప్ప రామారావు, ఎంపీటీసీ సభ్యుడు చొప్ప సత్యం, మండలశాఖ అధికారులు, టీడీపీ నాయకులు కెంగువ శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణకే పరిమితం



టౌన్: మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణకు సమస్యలు చెబుతున్న ప్రజలు

విజయనగరం టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 17, 7, 28, 37, 38 వార్డుల్లో జన్మభూమి సభలు నిర్వహించారు. అయితే ప్రతి వార్డులోనూ ప్రజలు అధికారులను నిలదీయడమే కనిపించింది. అధికారులు, పాలకులు కూడా దరఖాస్తుల స్వీకరణకే ప్రాధాన్యం ఇచ్చారు తప్ప సమస్యల పరిష్కారం వైపు దృష్టి సారించలేదనే విమర్శలు వినిపించాయి. 17వ వార్డులో చందక రామలక్ష్మి మాట్లాడుతూ, మూడోవిడత జన్మభూమిలో కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని చెప్పిన అధికారులు, పాలకులు మళ్లీ దరఖాస్తు చేసుకోమనడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ప్రశాంతినగర్‌లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని వార్డు సభ్యుడు మరిశర్ల దుర్గారావు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ మాట్లాడుతూ, పట్టణాన్ని రూ.200 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, కౌన్సిలర్ ఆదుర్తి వాసుదేవరావు, 37వ వార్డు కౌన్సిలర్ కంది మురళీనాయుడు, 7 వార్డు కౌన్సిలర్ రౌతు పద్మ, , 27 వార్డు సైలాడ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

'చెంబు'కు శవయాత్ర



చెంబును దహనం చేస్తున్న విద్యార్థులు

విజయనగరంఅర్బన్:

మరుగుదొడ్ల వినియోగంపై ప్రభుత్వ లక్ష్య సాధనకు పాఠశాల విద్యార్థులు మేమ సైతం అంటూ ముందుకు వస్తూ వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. పట్టణంలోని కణపాక ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆరుబయట మలవిసర్జనను మానుకోవాలన్న సందేశంతో పట్టణ వీధుల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఆరుబయటకు వెళ్లడానికి అవసరమైన నీళ్ల చెంబుకి శవయాత్ర చేపట్టారు. అనంరతం చెంబును దహనం చేశారు. విద్యార్థుల చైతన్యస్ఫూర్తిని పలువురు అభినందించారు.

రవాణా చట్టంలో మార్పులు చేయవద్దు..

● సీఐటీయూ నాయకులు

విజయనగరం పూల్‌భాగ్: రోడ్డు రవాణా చట్టంలో మార్పులు తీసుకురావద్దని సీఐటీయూ డివిజన్ ఉపాధ్యక్షుడు బూర్లి రమణ, కనకదుర్గా ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బి. పాపారావు, అధ్యక్షుడు కె. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాజ్యసభలో రవాణా చట్టంలో మార్పులు చేస్తూ శుక్రవారం బిల్లు ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ బిల్లు ఆమోదిస్తే డ్రైవర్లు ఇబ్బంది పడతారన్నారు. అలాగే ప్రమాదాలకు బాధ్యులను చేస్తూ డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్స్‌ను రద్దు చేయాలనుకోవడం తగదన్నారు. బిల్లుకు నాయకులెవ్వరూ మద్దతు పలకవద్దని కోరారు. కార్యక్రమంలో జి. రామకృష్ణ, గౌరి, తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆకట్టుకున్న ఏకపాత్రాభినయ నాటిక పోటీలు

విజయనగరం టౌన్: కణపాక చెన్నారెడ్డి కాలనీలో దేవీ నల్లమారమ్మ చదురు వద్ద శ్రీనివాసా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఏకపాత్రాభినయ నాటిక పోటీలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన ఆర్‌బీ రామానాయుడు మాట్లాడుతూ, ప్రముఖ నటుడు గణేష్‌పాత్రో వర్ధంతిని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహించామన్నారు పాత్రో సినీ మాటల రచయితగా ఉత్తరాంధ్ర పేరును ప్రపంచానికి చాటిచెప్పారని తెలిపారు. అనంతరం నాటిక పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నారిండ్ల శ్రీనివాసరావు, నరవ సంతోషి, దీపిల్లి అప్పారావు, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ముక్కాం తీర ప్రజల్ని తరలిస్తే మేలు

- సీఆర్‌జెడ్ నిబంధనలను ప్రభుత్వం కచ్చితంగా అమలుచెయ్యాలి
- జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా హెచ్చరిక



ముక్కాంలో కోతకుగురైన ప్రాంతం



విద్యాసాగర్

విశాఖ సిటీ: విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముక్కాం గ్రామంలో తీరప్రాంతంలో నివసిస్తున్న ప్రజల్ని తరలిస్తే మేలని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ జీవీ విద్యాసాగర్ సూచించారు. ఈ నెల ఒకటో తేదీన ముక్కాం గ్రామంలో 100 నుంచి 150 మీటర్ల మేర సముద్రం కోతకు గురైంది. తీరానికి ఆనుకొని నిర్మించిన సిమెంట్ రోడ్డు వరకూ కోతకు గురవ్వడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకొని సముద్రగర్భ అన్వేషణలో సీనియర్ సైంటిస్టులు డా.అంబిలీ, డా. బాలచంద్రుడు, డా.కృష్ణప్రసాద్‌లతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించామని విద్యాసాగర్ తెలిపారు. భూమి, చంద్రుడు, సూర్యుడుతో పాటు ఇతర గ్రహాల కదలిక వల్ల గురుత్వాకర్షణ శక్తిలో కలిగే మార్పులకు అనుగుణంగా వచ్చే ఆటుపోట్లతో ఈ తరహా కోతలు ఏర్పడతాయన్నారు. ముక్కాం గ్రామంలో ఖోండలైట్ శిలలతో కూడిన హై నేరో ల్యాండ్ ఏర్పడటం వల్ల ఆటుపోట్ల వక్రీభవనం చెంది గట్టిగా తీరాన్ని తాకడం వల్ల కోతకు గురైనట్లు తమ పరిశోధనల్లో తేలిందని వివరించారు. కోతకు గురైన సమయంలో అలలు 1.5 నుంచి 2 మీటర్ల లోపు ఎగసిపడ్డాయని వెల్లడించారు. సీఆర్‌జెడ్ నిబంధనల మేరకు తీరానికి 500 మీటర్ల లోపల ఎలాంటి నిర్మాణాలకు అనుమతించకూడదనీ, ఈ ప్రాంతంలో మాత్రం ఈ తరహా నిర్మాణాలుండటం అంత శ్రేయస్కరం కాదని సూచించారు. భవిష్యత్తులో ప్రమాదం దృష్ట్యా కోతకు గురైన ప్రాంతానికి సమీపంలో నివసిస్తున్న వారిని అక్కడి నుంచి తరలిస్తే మేలన్నారు. అదే విధంగా ఉప్పాడ ప్రాంతంలోనూ కోతకు గురవుతున్న తీవ్రతను అధికంగా ఉన్నట్లు గుర్తించామని విద్యాసాగర్ తెలిపారు. కోత తీవ్రత అధికమవకుండానే కాంక్రీట్ టెట్రాపోడ్స్, క్వాడ్రాపోడ్స్, హాలో క్యూబ్స్‌ని వేస్తే ఉపశమనం ఉంటుందని సూచించారు. ఈ టెట్రాపోడ్స్ ఒక్కొక్కటీ 2 నుంచి 3 టన్నుల బరువుంటే మంచిదనీ, రాళ్లను అడ్డుకట్టగా వేస్తే.. అది మరింత ప్రమాదమని హెచ్చరించారు. అదే విధంగా అధునాతన విధానమైన శాండ్ బ్యాగ్స్‌ను లేయర్ల రూపంలో వేసినా కోతను నివారించవచ్చనీ తెలిపారు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వరకూ ఉన్న తీర ప్రాంతంలో కోతకు గురవుతున్న ప్రదేశాలపై అధ్యయనం చేస్తున్నామని విద్యాసాగర్ వివరించారు. ముక్కాం గ్రామానికి సంబంధించిన నివేదికను సిద్ధం చేశామనీ, రెండు రోజుల్లో జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

- ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగుల ఐక్యవేదిక నాయకుడు గోవింద్



కోట జంక్షన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగ అభ్యర్థులు

విజయనగరం టౌన్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న లక్షా ఎనభై వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని నిరుద్యోగుల ఐక్యవేదిక నాయకుడు లగుడు గోవింద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కోట జంక్షన్ వద్ద నిరుద్యోగ అభ్యర్థులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ, గ్రూప్ 1, 2,3 ,4 నోటిఫికేషన్ల ద్వారా పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఏపీపీఎస్సీ క్యాలెండర్ విధానాన్ని అమలు చేయాలని, డీఎస్సీ ఎగ్జామ్‌ను ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నిర్వహణ బాధ్యత జిల్లా సెలక్షన్ కమిటీకే ఇవ్వాలన్నారు. అలాగే గ్రూప్ -1 ఇంటర్వ్యూలను పారదర్శకంగా నిర్వహించాలని, ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల దోపిడీని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

‘కోడి పందాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి’



మాట్లాడుతున్న సంఘ ప్రతినిధులు

విజయనగరం పూల్‌బాగ్: కోడి, గొర్రె పందాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గోవులు, జంతువుల సంరక్షణ సంఘ జిల్లా సహాయ కార్యదర్శులు టి. శ్రీనివాస్, ఎం. సోంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, నోరులేని మూగజీవాలను హింసిస్తూ మానసిక ఆనందం పొందే వారిని క్షమించరాదని చెప్పారు. ఈ విషయంలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.

నన్నెవరూ మోసం చేయలేరు

▶ మొదటి పేజీ తరువాయి

జిల్లాను అభివృద్ధి చేస్తానంటూ ప్రసంగం ప్రారంభించిన సీఎం పిల్లలు ఒత్తిడికి గురి కావటంతో ఆత్మహత్మలకు పాల్పడుతున్నారన్నారు. అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రాలోనే విద్యార్థుల ఆత్మహత్యలు తక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని కొన్ని పాఠశాలల్లో తెల్లవారితే 4 గంటలకు నిద్రలేపి రాత్రి 12 గంటల వరకు చదివించటంతో సమస్యలు వస్తున్నాయని, పిల్లల జీవితాలతో ఆడుకోవటానికి వీల్లేదన్నారు. సమైకాంధ్రంగా ఉన్నపుడు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రాష్ట్రం కాగా తానే హైటెక్ సిటీ పెట్టి, 25 ఇంజినీరింగ్ కాలేజీలు, మెడికల్ కాలేజీలు ఉంటే 300లకు పెంచానని చెప్పుకొచ్చారు. పిల్లల్ని పనిలో పెట్టుకోవటం క్షమించరాని నేరం అని, 6 నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న పిల్లలు స్కూల్లో ఉండాలనీ తెలిపారు. ఒకప్పుడు ఫ్యామిలీ ప్లానింగ్ చేసుకోమని చెప్పిన తానే పిల్లల్ని కనండి జనాభా పెంచండి అని ఇప్పుడు చెబుతున్నాననీ పిలుపునిచ్చారు. లేకుంటే ఇతర దేశాల మాదిరి ముసలి వారి సంఖ్య పెరిగిపోతుందని ముందు జాగ్రత్తతో ప్రచారం ప్రారంభిస్తున్నాననీ వివరించారు. సోషల్ వెల్ఫేర్ స్కూల్స్‌ను రెసిడెన్షియల్ స్కూల్స్‌గా మార్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా డిజిటల్ తరగతులు అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో యూనివర్శిటీలను మెరుగుపర్చేందుకు పోటీ పెట్టి ఎక్కడికక్కడ యూనివర్శిటీ, ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలకు ర్యాంకింగ్‌లు ఇస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్‌లో జీవితాలను మార్చేది టెక్నాలజీ అని అయితే దానికి బానిసలు కావద్దనీ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గంటా శ్రీనివాసరావు, సుజయ కృష్ణ రంగారావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.



పెదమరికి జీసీసీ సేల్స్ డిపో వద్ద సిగ్నల్ అందక అవస్థలు పడుతున్న సేల్స్‌మన్

సిగ్నల్ కష్టాలు...

ఆంధ్రప్రదేశ్ గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా గిరిజనులకు అందిస్తున్న నిత్యావసర సరుకులు లబ్ధిదారులకు సక్రమంగా అందడం లేదు. సరుకులు తీసుకోవడానికి గిరిజన లబ్ధిదారులు అష్టకష్టాలు పడుతున్నారు. కిలోమీటర్ల దూరం నడిచి డిపోకు చేరుకోవడమే పెద్ద పనైతే డిపోకు వచ్చిన తరువాత సరుకులతో ఆ రోజు తీసుకువెళ్తామన్న గ్యారంటీ మాత్రం వారికి లేదు.

పార్వతీపురం జీసీసీ పరిధిలో డిపోలు :	102	లబ్ధిదారులు :	50,209
ఈ-పాస్ ద్వారా పంపిణీ చేయాల్సిన డిపోలు :	53	ఈ-పాస్ పని చేయని డిపోలు :	49
ఈ-పాస్ బాగా పనిచేస్తున్నవి :	29	ఈ-పాస్ పనిచేయనవి (సిగ్నల్ అందక) :	24

- జీసీసీలో నిత్యావసర సరుకుల కోసం నిరీక్షణ
- సిగ్నల్ కోసం ఇళ్లపైకి ఎక్కుతున్న సేల్స్‌మన్లు
- కొన్ని డిపోల్లో రోజుకు ఐదుగురికి మించి సరుకులు అందని పరిస్థితి

పార్వతీపురం:

జీసీసీలో నిత్యావసర సరుకుల కోసం కొన్ని డిపోల వద్ద రోజంతా నిరీక్షించాల్సి వస్తుంటే మరికొన్ని డిపోల్లో రోజుల తరబడి డిపోల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీనికి ప్రధాన కారణం ఈ పాస్ విధానాన్ని అమలు చేయడం, ఈ-పాస్ మిషన్లు సక్రమంగా పనిచేయకపోవడం. లబ్ధిదారులకు పారదర్శకంగా సరుకులు అందించాలనే సదుద్దేశంతో ఈ-పాస్ విధానాన్ని అమలు చేసినప్పటికీ అవి సత్ఫలితాలను ఇవ్వలేకపోతున్నాయి. అన్ని నెట్‌వర్కులు ఉన్న మైదాన ప్రాంత గిరిజన పల్లెల్లోనే సిగ్నల్ అందకపోవడంతో ఈ-పాస్ యంత్రాలు మొరాయిస్తున్నాయి. సిగ్నల్ కోసం సేల్స్‌మేన్‌లు మేడలు, ఎత్తైన గుట్టలు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఒక్కో డిపో వద్ద రోజుకు ముగ్గురికి మించి సరుకులు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.

ఏడాదిగా...

ఏడాది కిందట జీసీసీలో ఈ పాస్ విధానాన్ని అమలు చేశారు. గిరిజనులు మోసపోకూడదని నిత్యావసర సరుకులు సక్రమంగా అందాలని సదుద్దేశంతో ఈ-పాస్ యంత్రాలను ప్రవేశపెట్టినప్పటికీ అవి క్షేత్రస్థాయిలో పనిచేయకపోవడంతో సమస్య మొదలైంది. మైదాన ప్రాంతాల్లోనే ఈ-పాస్ యంత్రాలు మొరాయిస్తుంటే ఏజన్సీ ప్రాంతమైన గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కురుపాం ప్రాంతాల్లో పరిస్థితి ఏలా ఉంటుందో చెప్పకనే చెప్పవచ్చు. పార్వతీపురం గిరిజన సహకార సంస్థ పరిధిలో మూడు సొసైటీలు ఉన్నాయి. గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం, సాలూరులలో ఈ సొసైటీలు ఉన్నాయి. వీటిలో పలుచోట్ల ఈ పాస్ యంత్రాల్లో వేలిముద్రలు వేసి లబ్ధిదారులు సరుకులు తీసుకెళ్లాల్సి వుంటుంది. కానీ 24 డిపోల్లో సిగ్నల్ అందక ఈ-పాస్ యంత్రాల్లో లబ్ధిదారుల వేలిముద్రలు పడడం లేదు. ఒక్కో లబ్ధిదారుడు వేలిముద్రను స్వీకరించాలంటే ఒక గంట పడుతుందో లేక ఒక రోజు పడుతుందో చెప్పలేని పరిస్థితి. ఒక్కోసారి లబ్ధిదారులు రెండు, మూడు రోజులు కూడా డిపో చుట్టూ తిరిగి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

పడిగాపులే...



జీసీసీ ద్వారా అందిస్తున్న నిత్యావసర సరుకులను తీసుకోవడానికి ప్రతీ నెల పడిగాపులు తప్పడం లేదు. పనులు మానుకొని కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి ఇక్కడ రోజంతా ఉండాల్సి వస్తోంది. రోజుకు ఐదుగురికి మించి సరుకులు అందడం లేదు.

–హిమరిక ఎర్రప్పు, కొత్తఊరు, మరికి పంచాయతీ


ప్రతీనెలా ఇబ్బందే...



సరుకుల కోసం ప్రతీ నెలా ఇబ్బందులు పడుతున్నాం. పనులు మానుకొని ఇంటికి ఒక మనిషి చొప్పున సరుకుల కోసం వస్తున్నాం. ఎన్నిసార్లు వేసినా వేలిముద్రలు పడడం లేదు. సరుకుల కోసమని కూలి పనులు మానుకోవల్సి వస్తుంది.

–మెల్లక ఆదమ్మ, కొత్త ఊరు, మరికి పంచాయతీ

చాలా ఇబ్బందులు పడుతున్నాం...



నిత్యావసర సరుకుల పంపిణీకి ఇబ్బందులు పడుతున్నాం. ఈ-పాస్ యంత్రం సిగ్నల్ లేక వేలిముద్రలు స్వీకరించడం లేదు. సిగ్నల్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. ఈ సమస్యను అధికారుల దృష్టికి ఎన్నోసార్లు తీసుకువెళ్లాం.

–త్రినాథ్ సేల్స్‌మన్, పెదమరికి

సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం

జీసీసీ సేల్స్ డిపోల్లో ఈ-పాస్‌యంత్రాలకు సిగ్నల్ సమస్య ఉంది. దీనిని ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకువెళ్లాం. ఆయన ద్వారా ప్రభుత్వానికి సమస్యను నివేదించాం. ఈ-పాస్ యంత్రాలు పని చేయని చోట సమస్యను పరిష్కరించాలని, లేకుంటే సాధారణ పద్ధతుల్లో సరుకుల పంపిణీకి అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరాం.

–భాస్కరరావు, జీసీసీ డివిజనల్ మేనేజర్

'అగ్రి' తక్షణ చెల్లింపులకు డిమాండ్

పార్వతీపురం టౌన్:

అగ్రి గోల్డ్ బాధితులకు తక్షణమే చెల్లింపులు జరపాలని, చనిపోయిన బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అగ్రి గోల్డ్ కష్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజయనగరం జిల్లా శాఖ డిమాండ్ చేసింది. అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఇవి.నాయుడు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి సూరప్పడు, బొబ్బిలి బ్రాంచ్ ప్రెసిడెంట్ పోల ఈశ్వరనారయణ విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. నేటికి మూడేళ్లు గడిచినా బాధితులకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. అగ్రిగోల్డ్ కుంభకోణం కారణంగా రాష్ట్రంలో వందలాది మంది ఆత్మహత్యలు, అసహజ మరణాలకు గురయ్యారని, యాజమాన్యం తాలూకా ఆస్తులు ప్రభుత్వం స్వాధీనం చేసుకొని రెండేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు ఒక్కరికీ కూడా చెల్లింపులు జరగలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు తక్షణమే నెరవేర్చాలని, బాధితులకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చెల్లింపులు జరపాలని, మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కస్టమర్ల తాలూకా డేటాను ఆన్‌లైన్‌లో పెట్టాలని, డిమాండ్లతో కూడిన వినతిని శుక్రవారం బొబ్బిలి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి అందించామని తెలిపారు.

రైల్వే పెన్షనర్ల సమస్యపై ప్రత్యేక దృష్టి

అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్

విజయనగరం టౌన్: రైల్వే పెన్షనర్ల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జికె.ప్రసాద్ పేర్కొన్నారు. రైల్వే న్యూకాలనీలో ఉన్న సంఘ కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న రైల్వే పెన్షనర్లతో సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ పరిధిలో ఉన్న సభ్యులకు అసోసియేషన్ తరపున సమస్యలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నామన్నారు. ఇటీవల కాలంలో విశాఖపట్టణంలో డీఆర్ఎమ్ కార్యాలయంలో పలు సమస్యలపై అధికారులకు విన్నవించామని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కొత్తగా అసోసియేషన్‌లో చేరిన సభ్యులు సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండకు మాతృ వియోగం

డెంకాడ: నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు మాతృ వియోగం కలిగింది. బడ్డుకొండ అప్పలనాయుడు తల్లి బడ్డుకొండ పార్వతమ్మ(80) శుక్రవారం తెల్లవారు జామున మోపాడ గ్రామంలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. పార్వతమ్మ భర్త సత్యంనాయుడు సమితి అధ్యక్షులుగా పని చేశారు. వీరికి కుమారుడు మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, కుమార్తె సుశీల ఉన్నారు. పార్వతమ్మ పార్థివ దేహాన్ని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సందర్శించి నివాళి అర్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా రాజకీయ వ్యవహారాల సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను), నెల్లిమర్ల ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామినాయుడు, వైఎస్సార్ సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ సమన్వయకర్త పెనుమత్స సురేష్‌బాబు, డెంకాడ ఎంపీపీ, జడ్పీటీసీలు కంది చంద్రశేఖరరావు, పతివాడ అప్పలనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు బొత్స లక్ష్మణరావు, అంబళ్ల శ్రీరాములనాయుడు, అవనాపు విజయ్, సింగుబాబు, మండల పార్టీ అధ్యక్షులు బంటుపల్లి వాసుదేవరావు, ఉప్పాడ సూర్యనారాయణ, పతివాడ అప్పలనాయుడు, చనుమల్లు వెంకటరమణ, పార్టీ నాయకులు మత్స సత్యన్నారాయణ, కంది సూర్యనారాయణ, రొంగలి కనకసింహాచలం, పతివాడ శ్రీను, ప్రభాకరరెడ్డి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళి అర్పించారు. పార్వతమ్మ అంత్యక్రియలు మోపాడలో శనివారం జరగనున్నాయి.



బడ్డుకొండ పార్వతమ్మ పార్థివ దేహం



పార్వతమ్మ(ఫైల్)

30న నాయీబ్రాహ్మణుల చలో విజయవాడ



చలో విజయవాడ కరపత్రాన్ని విడుదల చేస్తున్న సంఘం నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: విజయవాడలో బెంజి సర్కిల్ దగ్గర మేరీస్టెల్లా ఇండోర్ స్టేడియంలో ఈ నెల 30న జరగనున్న నాయీ బ్రాహ్మణ రాష్ట్ర మహాసభలకు జిల్లాలోని నాయీ బ్రాహ్మణులంతా తరలి రావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామేశ్వరపు రామారావు పిలుపునిచ్చారు. స్థానిక డకినవీధిలో జిల్లా నాయీ బ్రాహ్మణసేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రామేశ్వరపు రామారావు అధ్యక్షతన జిల్లా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బార్బర్ షాపులకు విద్యుత్ చార్జీలను 250 యూనిట్ల వరకూ ఉచితంగా, ఆపైన కమర్షియల్ నుంచి డొమెస్టిక్‌గా మార్చాలన్నారు. నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ రద్దు చేసి, దాని స్థానంలో కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఏడాదికి రూ.500 కోట్లు నిధులు కేటాయించి బ్యాంకులతో సంబంధం లేకుండా ఆర్థిక సహకారం అందించాలన్నారు. శాసన మండలి ద్వారా చట్టసభల్లో అవకాశం కల్పించాలని, అలాగే నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. రాష్ట్రంలో గుర్తింపు పొందిన దేవాలయాల్లోని క్షురకులు, వాయిద్యకారులను శాశ్వత ఉద్యోగులుగా నియమించాలన్నారు. నాయీ బ్రాహ్మణ మహిళలకు బ్యూటీపార్లర్ శిక్షణ కల్పించి, పార్లర్ ఏర్పాటుకు 50శాతం సబ్సిడీతో రూ.5లక్షలు ఆర్థిక సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు టి.బుజ్జిబాబు, చిప్పాడ శంకర్రావు, ఎం.అప్పారావు, బంగారు శ్రీనివాసరావు, ఉప్పాడి సత్యనారాయణ, ఎం.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంకల్ప యాత్ర

మనవడ్ని చూసినాం.. చాలు



'మా లాంటి వాళ్ల కోసం మా మనవడు (వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి) ఎండల్లో నడిసొస్తాండాడంటే చూడాలని వచ్చినాం. ఆయన్ను చూసినాం. మా బాగోగులు అడిగినాడు. సొంత బిడ్డలా మాట్లాడినాడు. పెద్దాయన్ను (వైఎస్ రాజశేఖరరెడ్డి)ని దగ్గర నుంచి చూసినట్లుండాది. మా మనవడు అధికారంలోకి రాగానే ముసలోళ్లకంతా నెలకు రూ.2వేల పింఛన్ ఇస్తామన్నాడు. ఊరూరా ఇదే విషయం చెబుతాం. అందరూ దీవిస్తా ఉండాం. మా మనవడు కచ్చితంగా సీఎం అవుతాడు..' అంటూ కురబపల్లెకు చెందిన వృద్ధులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా పుంగనూరు నియోజకవర్గంలోని గాండ్లపల్లె నుంచి పాదయాత్రగా బయలుదేరిన జననేత అక్కడే ఉన్న వృద్ధుల్ని కలిశారు. ఆప్యాయంగా పలకరించి వారి బాగోగులు అడగడంతో వృద్ధులు ఉప్పొంగిపోయారు. – చిత్తూరు అర్బన్

మాఫీ లేదు..పెట్టుబడీ లేదు



సాక్షి, చిత్తూరు : ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం చిత్తూరు జిల్లా సదుం మండలం గాండ్లపల్లెలో వరి రైతు సుధాకర్‌తో జననేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడారు. రైతుతో కలిసి ధాన్యం తూర్పారబట్టారు. అనంతరం అన్నదాత కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏం అడిగారంటే..

జగన్: ఈ వరి ధాన్యం ఏ రకం?
రైతు: సోనామసూరి సార్
జగన్: ఎకరాకు ఎంత ఖర్చవుతుంది?
రైతు: రూ.30 వేల వరకు అవుతుందన్నా..
జగన్: ఎంత దిగుబడి వస్తుంది?
రైతు: 25 బస్తాల వరకు..
జగన్: ఖర్చులు పోను ఎంత మిగులుతుంది?
రైతు: ఏం మిగలట్లేదు సార్. 75 కేజీల బస్తా రూ.1000. ఇంకా రూ.5 వేలు చేతి నుంచే పడుతోంది. పాడి ఉండబట్టి ఇల్లు గడుస్తోంది.
జగన్: బ్యాంకులో ఎంత రుణం ఉంది? అప్పు మాఫీ అయ్యిందా?
రైతు : రూ.1లక్ష దాకా అప్పు ఉంది. ఒక్క రూపాయీ మాఫీ కాలేదు సార్. చంద్రబాబు నాయుడు మోసం చేసినాడు. బ్యాంకు నుంచి రెండు రోజులకొక సారి వడ్డీ అయినా కట్టాలని ఫోన్ వస్తా ఉండాది. పెట్టుబడులు చూసుకుందుమా..? అప్పులు కట్టుకుందుమా?. ఆ మహానుభావుడు వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్నపుడు రూ.50 వేల దాకా మాఫీ అయ్యింది
జగన్: పాలలో అయినా మిగులుతోందా?
రైతు: ఆడికాడికి సరిపోతా ఉండాది సార్..
జగన్: పాలు లీటర్‌కు రూ.4 రాయితీ ఇస్తామని హామీ ఇచ్చాం తెలిసిందా?
రైతు: తెలిసింది సార్. బాగుంది. పాలపై రాయితీ ఇస్తే చాలా మంచిది. రైతు భరోసా కింద రూ.12,500 ఇస్తారని కూడా తెలిసింది.


కదిలిన జగన్ సైన్యం


గాండ్లపల్లెలో రైతులు ప్రేమగా చుట్టిన తలపాగాతో జననేత జగన్‌మోహన్‌రెడ్డి


ఆనంద క్షణం..

అదిగదిగో అన్న..

తలపాగా ఇ

నవరత్నాలు తెస్తా : అకా







చెల్లెమ్మ అభివాదం..



జగనన్న అభిమానం..



రాజన్న బిడ్డను చూడాలని..



జనకెరటం : చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలోని సదుంలో జరిగిన బహిరంగ సభకు తరలివచ్చిన అశేష జనం

ఉత్సాహం

గుండె నిండా సంకల్పం..

లక్ష్య సాధనపై పట్టుదల..

ప్రజలతో మమేకమవ్వాలనే బలమైన కాంక్ష..

ఎంచుకున్న మార్గంపై విశ్వాసం..

వెంట అనుసరిస్తున్న వేలాది జనం..

.. ఇవీ వైఎస్సార్‌సీపీ అధినేత..విపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నవ్యోత్సాహంతో పాదయాత్రలో ముందుకు నడిపిస్తున్న అంశాలు.. మొండైన ఆత్మవిశ్వాసంతో అలుపెరుగుని ఆయన అడుగులు రాష్ట్ర చరిత్రను ప్రభావితం చేస్తున్నాయి. ఉదయం తొలి అడుగు పడింది మొదలు చీకటి పడ్డాక బస చేరేవరకూ జనం మధ్యే ప్రస్తానం.. రాజన్న వారసత్వంగా పుణికిపుచ్చుకున్న చెరగని చిరునవ్వు.. సామాన్యుడ్ని అక్కున చేర్చుకునే ప్రేమానురాగం ఈ సంకల్ప సూరీడి విశిష్టతలు. ఇవి చూసే చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గ పల్లె ప్రజలు తమ నాయకుడొచ్చాడని సంబర పడుతున్నారు.. ప్రేమతో అభిమానాలు కురిపిస్తున్నారు.

Praja Sankalpa Yatra



అనురాగ హారతి



గాండ్లపల్లెలో హారతి పడుతున్న అక్కాచెల్లెమ్మలు

ఆత్మీయ సెల్ఫీ



జగనన్నతో సెల్ఫీ తీసుకుంటున్న చెల్లెమ్మ

చిరు కానుక



యాదవ సంఘం నాయకుల కానుక

విన్నపాలు



కందూరు క్రాస్ వద్ద అక్కాచెల్లెమ్మల వినతి

మనువడి ఆప్యాయత



గాండ్లపల్లెలో తాతయ్యను పలకరిస్తూ..

దివ్యమైన భరోసా



సదుంలో దివ్యాంగుడితో మాట్లాడుతూ..

రైతు బిడ్డగా..



...లా చుట్టాలి..



...్కాచెల్లెమ్మలకు భరోసా ఇస్తున్న జననేత



అధైర్యపడొద్దు అండగా ఉంటా..



నేనున్నానని : దివ్యాంగుడికి ధైర్యంచెబుతూ..

అభిమానం తోడుగా..



తాత కష్టం వింటున్న మనుమడు

వృద్ధాశ్రమానికి వ్యాన్ వితరణ



వితరణగా అందించిన వ్యాన్‌తో దాత రంగారావు, సంస్థ నిర్వాహకులు

విజయనగరం రూరల్: మండలంలోని పినవేమలిలో ఉన్న ఎబీసీడీ వృద్ధాశ్రమానికి విజయనగరానికి చెందిన అప్పసాని రంగారావు మారుతి వ్యాన్‌ను శుక్రవారం వితరణగా అందజేశారు. తన తండ్రి అప్పన్నదొర జ్ఞాపకార్థం వ్యాన్‌ను వృద్ధాశ్రమానికి అందించినట్లు రంగారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్యవసర సమయాల్లో వృద్ధులను వివిధ ప్రాంతాలకు తరలించడానికి వ్యాన్ ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలన్నారు. వ్యాన్‌ను వితరణగా అందించిన రంగారావుకు ఏబీసీడీ సంస్థ నిర్వాహకులు ఎ.సన్యాసినాయుడు, పి.అప్పలనాయుడు, అప్పలనాయుడు, వృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు.

సైనిక స్కూల్ ప్రవేశ పరీక్ష రేపు



కోరుకొండ సైనిక పాఠశాల

విజయనగరం రూరల్: ఆల్ ఇండియా సైనిక స్కూల్ ప్రవేశ పరీక్ష రాష్ట్ర వ్యాప్తంగా పది కేంద్రాల్లో ఈ నెల 7న నిర్వహించనున్నట్టు కోరుకొండ సైనిక స్కూల్ ప్రిన్సిపాల్, కల్నల్ రుద్రాక్షఅత్రి శుక్రవారం తెలిపారు. 2018–19 సంవత్సరానికి సైనిక పాఠశాలల్లో ఆరు, తొమ్మిది తరగతుల్లో ప్రవేశ పరీక్షకు 5,855 మంది దరఖాస్తు చేసుకున్నట్టు వెల్లడించారు. గతేడాది రెండు తరగతులకు 3,577 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఏపీలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్‌లో మూడు చోట్ల, కరీంనగర్ పరీక్ష కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆరోతరగతి పరీక్ష 10 నుంచి 12.30 గంటల వరకు, తొమ్మిదో తరగతి వారికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రవేశ పరీక్ష ఓఎంఆర్ విధానంలో మల్టిపుల్ చాయిస్ విధానంలో జరుగుతుందని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులందరూ హాల్‌టిక్కెట్ పట్టుకుని అరగంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

కాలం చెల్లినా కనిపించలేదా..!

- అంగన్‌వాడీ కేంద్రాలకు గడువు ముగిసిన నూనె సరఫరా
- వాటినే వినియోగిస్తున్న సిబ్బంది
- చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రభావం..

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నాం.. వాటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం.. అని గొప్పలు చెప్పుకునే నాయకులు, అధికారులు ఆచరణలో విఫలమవుతున్నారు. కేంద్రాల్లో తయారు చేస్తున్న పౌష్టికాహారానికి నాణ్యమైన సరుకులు సరఫరా చేయాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కేంద్రాలకు నాసిరకం సరుకులు సరఫరా అవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలకు కాలం చెల్లిన నూనె ప్యాకెట్లు సరఫరా చేశారు. కాలపరిమితి ముగిసి ఐదు నెలలు దాటిపోయినప్పటికీ ఆ నూనెనే కేంద్రాలకు అందించారు. తప్పనిసరి పరిస్థితుల్లో సిబ్బంది ఆ నూనెనే వినియోగిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రతి రోజూ మధ్యాహ్నం భోజనం పెడతారు. గర్భిణులకు పాలు, సాంబారు, కూర అన్నం పెడతారు. పిల్లలకు సాంబారు, అన్నం లేదంటే కూర, రసం, అన్నం పెడతారు.

జిల్లా వ్యాప్తంగా 17 ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. ఆయా ప్రాజెక్టుల పరిధిలో 2987 అంగన్‌వాడీ, 742 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో

17 ఐసీడీఎస్ ప్రాజెక్టులు

మూడేళ్లలోపు చిన్నారులు 85,331 మంది, 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలు 47,074 మంది, గర్భిణులు 22, 457 మంది, బాలింతలు 21,638 మంది ఉన్నారు.

వంటల్లో కాలం చెల్లిన నూనె వినియోగించడం వల్ల తమ ఆరోగ్యాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని గర్భిణులు, బాలింతలు ఆందోళన చెందుతున్నారు. ఒక్కో

ఆరోగ్యంపై ప్రభావం

కేంద్రంలో నాలుగు లీటర్ల వరకు నూనె వినియోగిస్తుంటారు. ఇటువంటి నూనెతో తయారు చేసిన ఆహార పదార్థాలు ఎలా తినాలని ప్రశ్నిస్తున్నారు.



పట్టణంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా అయిన గడువు దాటిన ఆయిల్ ప్యాకెట్

నా దృష్టికి రాలేదు..

కాలపరిమితి దాటిన నూనె ప్యాకెట్ల విషయం నా దృష్టికి రాలేదు. సూపర్‌వైజర్లతో తక్షణమే తనిఖీలు చేపడతాం. కాలపరిమితి దాటిన ఆయిల్ ప్యాకెట్లు ఉన్నట్టైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

– ఎం.శ్రీదేవి, సీడీపీఓ, విజయనగరం

ధనుర్విద్యతో ఏకాగ్రత

- నేటి నుంచి రామనారాయణంలో శిక్షణ కార్యక్రమం
- ఎన్‌సీఎస్ ట్రస్ట్ నారాయణం శ్రీనివాస్

విజయనగరం రూరల్: ధనుర్విద్య అభ్యసించడం ద్వారా ఏకాగ్రత సాధించడంతో పాటు అనుకున్న లక్ష్యాన్ని సులువుగా ఛేదించవచ్చని నారాయణం చారిటబుల్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఐనాక్స్ కాంప్లెక్స్‌లోని కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రమైన రామనారాయణంలో శనివారం నుంచి ధనుర్విద్యపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాన్ని ఆ రోజు ఉదయం 10.30 గంటలకు సైనిక పాఠశాల ప్రిన్సిపాల్, కల్నల్ రుద్రాక్ష అత్రి ప్రారంభిస్తారని చెప్పారు. రాముడు నుంచి అర్జునుడి వరకు ఎంతోమంది ధనుర్విద్యలో రాణించారని తెలిపారు. 16 ఏళ్లు దాటిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి 8 వరకు.. సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తుతో పాటు ప్రవేశ రుసుం కింద వంద రూపాయలను ఎన్‌సీఎస్ కార్యాలయంలో గాని, రామనారాయణం కార్యాలయంలో గాని అందించాలన్నారు. అనంతరం ధనుర్విద్యపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రామనారాయణం ప్రధాన అర్చకుడు చాణక్య, ఆలయ ప్రతినిధులు ఏవీ రమణ, శ్రీనివాసరావు, సముద్రాల గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎన్‌సీఎస్ ట్రస్టీ శ్రీనివాస్, సంస్థ ప్రతినిధులు

ఎమ్మెల్యే, అతని కుమారుడిని అరెస్ట్ చేయాలి



బాధితులను పరామర్శిస్తున్న శ్రీనివాసరావు

విజయనగరం ఫోర్ట్: డెంకాడ మండలం మొదవలస గ్రామానికి చెందిన దళితులపై దాడి చేయించిన నెల్లిమర్ల ఎమ్మెల్యే, అతని కుమారుడిపై అట్రాసిటీ కేసు పెట్టి తక్షణమే అరెస్ట్ చేయాలని మాలమహానాడు జిల్లా ప్రధానకార్యదర్శి తెరపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న మొదవలస దళితులను శుక్రవారం రాత్రి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జన్మభూమి కార్యక్రమంలో దరఖాస్తు ఇవ్వడానికి సిద్ధపడుతున్న తరుణంలో దళితుల చేతుల్లో ఉన్న దరఖాస్తులను చించివేసి దాడికి పాల్పడడం దారుణమన్నారు. అంతటితో ఆగకుండా గాయపడ్డ వారిని చూడడానికి వస్తున్న వారిని మార్గమధ్యలో అడ్డుకుని వారిపై కూడా దాడి చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు ఒక్కొక్కరికీ రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వడంతో పాటు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. టీడీపీ ప్రభుత్వంలో దళితులపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. ఈ విషయమై భవిష్యత్ కార్యాచరణపై దళిత నేతలంతా శనివారం సమావేశమై నిర్ణయిస్తామన్నారు. కార్యక్రమంలోఅప్పలస్వామి, రమణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్యే బెదిరింపులపై ఉద్యోగ సంఘాలు గరంగరం

సాక్షి, అమరావతి: విజయనగరం జిల్లా పరిషత్ సమావేశంలో పార్వతీపురం పంచాయతీరాజ్ ఈఈ, ఇతర ఇంజినీరింగ్ అధికారులపై గజపతినగరం టీడీపీ ఎమ్మెల్యే అప్పలనాయుడు, జడ్పీటీసీ రమణలు బెదిరింపులతో పాటు వ్యక్తిగత దూషణలకు దిగడంపై ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ తీవ్రంగా తప్పుపట్టింది. సంఘం ప్రతినిధులు శుక్రవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి బెదిరింపులకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలంటూ వినతిపత్రం అందజేశారు. తప్పక చర్యలు తీసుకుంటామని.. భవిష్యత్‌లో అధికారులతో ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసేలా చూస్తానని హామీ ఇచ్చినట్టు ఇంజినీరింగ్ ఉద్యోగ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రియాజ్ అహ్మద్, హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ రూపొందించిన 2018 నూతన సంవత్సర డైరీని మంత్రి ఆవిష్కరించారు.

విద్యా విధానం బాగానే ఉంది..

- స్కూల్ ఎడ్యుకేషన్ స్టేట్ అడిషనల్ డైరెక్టర్ భార్గవ్

శృంగవరపుకోట రూరల్: ప్రభుత్వ విద్యా విధానం బాగానే ఉందని స్కూల్ ఎడ్యుకేషనల్ స్టేట్ డైరెక్టర్, జన్మభూమి సభల నియోజకవర్గ నోడల్ అధికారి భార్గవ్ అన్నారు. మండలంలోని వెంకటరమణపేట ప్రాథమికోన్నత పాఠశాలలో 'విద్య – వికాసం' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చేసిన ప్రదర్శనలు, ఆహార పదార్థాలు, బొమ్మల తయారీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రణాళికాబద్ధంగా పాఠశాల విద్య అమలవుతోందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్య కొనసాగుతోందన్నారు. పిల్లల డ్రాపౌట్స్ తగ్గించడంతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు.

పేద, ధనిక తేడా లేకుండా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, ఉపకారవేతనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో కూడా వ్యాయామ ఉపాధ్యాయులను (పీఈటీలు) నియమించి వ్యాయామ విద్య అమలుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి వెంకన్న, జెడ్పీటీసీ సభ్యురాలు ఎస్.రామలక్ష్మి, ఎంపీడీఓ జె.మన్మధరావు, ఎంఈఓ బి.అప్పారావు, హెచ్ఎం సీహెచ్ వెంకటరావు, సర్పంచ్ బి.సూర్యకుమారి, ఎంపీటీసీ సభ్యుడు కనిశెట్టి సన్నిబాబు, గ్రామపెద్దలు జుత్తాడ రామసత్యం, ఆవాల గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థులు తయారు చేసిన బొమ్మలను పరిశీలిస్తున్న అడిషనల్ డైరెక్టర్ భార్గవ్, ఎంపీపీ వెంకన్న తదితరులు

సమస్యలు ప్రస్తావన లేని సీఎం సభ

- గ్రోత్ సెంటర్, జ్యూట్ మిల్లుల సమస్యను గాలికొదిలేసిన వైనం
- పాత వాటికి జోడించిన కొత్త హామీలు
- గ్రామీణ రోడ్లకు రూ.24కోట్లు కేటాయిస్తామని హామీ
- గొల్లాది వంతెన మంజూరు


ప్రత్యూషను అభినందిస్తున్న దుశ్శాలువతో సత్కరిస్తున్న సీఎం

బొబ్బిలి: సీఎం చంద్రబాబునాయుడు బొబ్బిలి పర్యటన బొబ్బిలి వాసుల ఆశలను ఆవిరిచేసింది. ఏళ్ల తరబడి వెంటాడుతున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్న హామీ ఇవ్వకపోవడం స్థానికులను కలచివేసింది. సుమారు 3 వేల మంది కార్మిక కుటుంబాలకు జీవనాధారమైన జ్యూట్ మిల్లు సమస్యను సీఎం గుర్తించకపోవడంపై కార్మిక కుటుంబాలు ఆవేదన చెందుతున్నాయి. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తామని కోరిన కార్మిక నాయకులను అదుపులోకి తీసుకుని కనీసం వినతిపత్రం కూడా ఇవ్వనీయకపోవడంపై కార్మికలోకం మండిపడుతోంది. సీఎం తీరును సీఐటీయూ నాయకులు పి.శంకరరావు, వి.శేషగిరి, ఇఫ్టూ నాయకులు ఎ.సింహాచలం విమర్శించారు. గతంలో బాబుతో పాటు కిరణ్‌కుమార్ రెడ్డి కూడా ఇచ్చిన గొల్లాది వద్ద వంతెన నిర్మాణం హామీనే మళ్లీ చంద్రబాబు నాయుడు ఇవ్వడం గమనార్హం. పీఆర్‌లో వంతెన పనులు మంజూరుతో పాటు కొత్తగా గ్రామీణ ప్రాంతాల్లో 9 రహదారులు నిర్మించేందుకు రూ.24 కోట్లు మంజూరు చేస్తామని చెప్పారు. బొబ్బిలి మండలం రాముడు వలసకు, తెర్లాం మండలం లోచర్లకు లిఫ్ట్‌ఇరిగేషన్ పనులను మంజూరు చేశారు. బొబ్బిలిలో ఇళ్ల స్థలాలు లేని 2,481 మందికి ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం కింద మంజూరు చేశారు. గిరి జనులకు పట్టాలను మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా అదనంగా 25వేల జలసిరి బోర్లను ప్రకటించారు. బొబ్బిలి సీహెచ్‌సీ 100 పడకల ఆస్పత్రిగా స్థాయిపెంచుతున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన తాగు నీటి పథకాన్ని మళ్లీ చంద్రబాబు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించడంపై జనం విస్తుపోయారు.

నారశింహునిపేట విద్యార్థినికి సీఎం అభినందన

బొబ్బిలి రూరల్: 'పిట్టకొంచెం.. కూత ఘనం' అన్న చందంగా ఆ చిన్నారి సీఎం, మంత్రులతోనే జన్మభూమి ప్రతిజ్ఞ చేయించింది. మండలంలో నారశింహునిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదోతరగతి చదువుతున్న డి.ప్రత్యూష జన్మభూమి, ఓడీఎఫ్, పచ్చని మొక్కలు నాటడం తదితర అంశాలతో ప్రతిజ్ఞ చేయించింది. ముందుగా చిన్నారి ప్రతిభను గుర్తించిన సీఎం చిన్నారి ముందు చెబితే అందరూ వెనుక చెప్పాలని సూచించారు. ప్రతిజ్ఞ పూర్తయిన తర్వాత చిన్నారిని శాలువాతో సీఎం అభినందించారు. ప్రత్యూషను డీఈఓ, హెచ్‌ఎం, సిబ్బంది అభినందించారు.

పెందుర్తి ఎమ్మెల్యే కొడుకును అరెస్టు చేయాలి

- ఇంటికో ఉద్యోగం ఏదీ?
- సీఎం సభ ముందు ఎస్సీ, ఎస్టీలు నిరసన ప్రదర్శన


సీఎం ప్రసంగిస్తుండగా ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలుపుతున్న ఎస్సీ, ఎస్టీలు

బొబ్బిలి: ఇటీవల సంచలనం సృష్టించిన జెర్రిపోతుల పాలెం ఘటనలో దోషులను శిక్షించాలని కోరుతూ పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన ఎస్సీ, ఎస్టీలు నిరసన తెలిపారు. సీఎం సభ జరుగుతుండగా రాజా కాలేజీ రోడ్డులో వారంతా నినాదాలు చేశారు. సీఎం సభ చప్పగా సాగుతున్న సమయంలో రోడ్డుపైకి పలువురు మహిళలు, యువత వచ్చి ప్లకార్డులు ప్రదర్శించారు. పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే కుమారుడిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జంతు పరిరక్షణ సంస్థ ఉపాధ్యక్షురాలు, ఎస్సీ నాయకురాలు బొగ్గ పద్మజ ఆధ్వర్యంలో సీఎంకు వ్యతిరేకంగా నినదించారు. కార్యక్రమంలో పలువురు యువకులు తమకు ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి చంద్రబాబు మోసం చేశారని, నేటికీ ఎవరికీ ఉద్యోగాలే కాకుండా కనీసం నిరుద్యోగ భృతి కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు.

మొక్కుబడిగా స్టాళ్ల పరిశీలన

బొబ్బిలి రూరల్: బొబ్బిలిలో ఏర్పాటుచేసిన జన్మభూమిలో పాల్గొనడానికి సీఎం చంద్రబాబునాయుడు శుక్రవారం మధ్యాహ్నం 2.05 గంటలకు గ్రోత్‌సెంటర్‌లో హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు. హెలీప్యాడ్ వద్ద మంత్రులు గంటా శ్రీనివాసరావు, సుజయ్‌కృష్ణ రంగారావు, జడ్పీ చైర్‌పర్సన్ స్వాతిరాణి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎదురు చూశారు. కొంతమంది ప్రజాప్రతినిధులను సీఎం సెక్యూరిటీ లోపలకు అనుమతించలేదు. దీంతో కొందరు అవమానంతో వెనుతిరిగారు. కలెక్టర్ వివేక్‌యాదవ్, మంత్రులు ఆయనకు స్వాగతం పలికారు. సీఎం బస్సులో రోడ్డు మార్గం గుండా ఐటీఐ కాలనీ, ఫ్లై ఓవర్‌మీదుగా రాజా కళాశాల గ్రౌండ్‌కు చేరుకున్నారు. తిరిగి 5.05 గంటలకు వేదిక నుంచి బయలుదేరి 5.10కు హెలీక్యాప్టర్‌లో తిరుగుపయనమయ్యారు. సభావేదిక వద్ద ఏర్పాటుచేసిన స్టాళ్లను,క్రీడలను మొక్కుబడిగా కేవలం 3 నిమిషాలు పరిశీలించి వెనుతిరగడంతో నిర్వాహకులు నిరాశ చెందారు. కష్టానికి గుర్తింపునివ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు.

పోలీసుల ఓవర్ యాక్షన్

సీఎం జన్మభూమి సభ ముగిసాక రాజా కళాశాల గ్రౌండ్ నుంచి బయటకు వస్తున్న మీడియా ప్రతినిధులను గజపతినగరం సర్కిల్‌లో పనిచేస్తున్నఎస్‌ఐ నాయుడు అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. డీఎస్పీ ఆదేశాల మేరకు సీఎం కాన్వాయ్ వెళ్లిన తర్వాత విడిచిపెట్టారు.

అసంతృప్తి సెగలు

- జన్మభూమిలో ఆగని నిలదీతలు
- ప్రభుత్వంపై వ్యతిరేకతతో తట్టుకోలేకపోతున్న అధికారపార్టీ నాయకులు
- రసాభాసగా మారిన నాలుగోరోజు జన్మభూమి సభలు

విజయనగరం గంటస్తంభం: ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని ప్రభుత్వం చెప్పుకుంటున్నా వాస్తవంగా అసంతృప్తితో ఉన్నారని జన్మభూమి కార్యక్రమంలో స్పష్టమవుతోంది. సంక్షేమ పథకాలు అందడంలేదంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. జన్మభూమి సభల్లో అధికార పార్టీ నేతలు, అధికారులను నిలదీస్తున్నారు.

నాల్గోరోజు సాగిందిలా...

- డెంకాడ మండలం మోదవలస జన్మభూమి గ్రామసభలో ఇచ్చేందుకు దరఖాస్తులు రాసుకుంటున్న దళితులపై తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు దాడికి దిగారు. దరఖాస్తులు తీసుకుని గ్రామసభకు రావద్దని బెదిరించారు.
- వేపాడ మండలం కొండగంగుబూడి గ్రామసభను సీపీఎం, వైఎస్సార్ సీపీ నాయకులు, జనం అడ్డుకున్నారు. గత జన్మభూమిలో ఇచ్చిన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రేషన్‌సరుకులు మాన్యువల్‌గా పంపిణీ చేయాలని పట్టుబట్టారు. చివరికి తహసీల్దారు పెంటయ్య సమస్యలు పరిష్కారానికి చొరవ తీసుకుంటామని, మాన్యువల్‌గా సరుకులు పంపిణీ చేస్తామని హామీ ఇవ్వడంతో రెండు గంటలు ఆలస్యంగా గ్రామసభ ప్రారంభమైంది.
- తెర్లాం మండలం లోచర్లలో జరిగిన గ్రామసభ రసాభాసగా మారింది. గతంలో ఇచ్చిన సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కాలేదని, ఇప్పుడు గ్రామానికి మళ్లీ ఎందుకొచ్చారని నిలదీశారు.
- చీపురుపల్లి మండలం రామలింగపురంలో జరిగిన గ్రామసభలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రద్దు చేయడంపై సర్పంచ్, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అధికారులను నిలదీశారు. జనాలు లేక సభలో విద్యార్థులను కూర్చోబెట్టారు.
- పూసపాటిరేగ మండలం కొవ్వాడలో జరిగిన గ్రామసభ ఉద్రిక్తత చోటు చేసుకుంది. మరుగుదొడ్ల బిల్లుల చెల్లింపులో వివక్షపై అధికారులను సర్పంచ్ ప్రశ్నించారు. కొవ్వాడలో దళితల సమస్యలపై సమాధానం చెప్పేందుకు ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి నాయుడు గ్రామసభకు రావాలని దళితులు పట్టుబట్టడంతో అధికారులు నెమ్మదిగా గ్రామసభ నుంచి జారుకున్నారు.

రానున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

- ఎమ్మెల్యే రాజన్నదొర
- కొఠియా గ్రామంలో పర్యటించిన మొదటి ఆంధ్రా ఎమ్మెల్యే రాజన్నదొర


పూలమాలలతో ఎమ్మెల్యే, నాయకులకు స్వాగతం పలికిన దిగువ గంజాయిభద్ర ప్రజలు

సాలూరురూరల్: రానున్నది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే రాజన్నదొర స్పష్టం చేశారు. వివాదాస్పద ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాల్లోని గంజాయిభద్ర పంచాయతీ ధూళిభద్ర, ఎగువశెంబి, కొఠియా, ఎగువగంజాయిభద్ర, దిగువగంజాయి భద్ర, కురిటిభద్ర గ్రామాల్లో శుక్రవారం వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు సువ్వాడ రమణ, వైస్ సర్పంచ్ గమ్మెల బీసు ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నాయకులకు అక్కడి ప్రజలు థింసా నృత్యాలు, మేళతాళాలతో స్వాగతం పలికారు. పూలమాలలు వేసి హారతులు పట్టారు. అసలు తామున్నమనే విషయాన్ని ఆంధ్రా పాలకులు విస్మరించారని, కనీసం ఓటరు గుర్తింపు కార్డులు లేని దుస్థితిలో ఉన్నమంటూ తమ కష్టాలను ఏకరవుపెట్టారు. రోడ్డు సదుపాయం లేక నరకయాతన పడుతున్నామన్నారు. పాఠశాల భవనాలకు మంజూరైన నిధులను నిర్మించకుండానే కాజేస్తున్నారని తెలిపారు. ఒక్క భవనం పేరు కూడా తెలుగులో లేదంటూ ఎమ్మెల్యేకు చూపించారు. రాళ్లదారిలో ప్రయాణించి మా కొఠియా గ్రామాల్లో పర్యటించిన మొట్టమొదటి ఆంధ్రా ప్రాంతపు ఎమ్మెల్యే మీరేనని స్థానికులు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయాంలో ఇక్కడ ఎస్పీఆర్ కింద ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. దండిగాం నుంచి గంజాయిభద్రకు రోడ్డు మంజూరుచేయించామని, ఈ నిర్మాణం ఎగువ శెంబి ముందు వరకూ వచ్చి కొన్ని అనివార్య కారణాలతో నిలిచిపోయిందన్నారు. సమస్యలను డాక్యుమెంటరీ రూపంలో కలెక్టర్, పీవోకు తెలియజేస్తానని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల్లో సమస్యలను ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. అప్పటికీ పరిష్కరించకుంటే రానున్నది మన ప్రభుత్వమేనని, జగన్ సీఎం అయిన వెంటనే సమస్యలన్నీ పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు రెడ్డి పద్మావతి, జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, సర్పంచ్ ఎం.ఆదయ్య, పార్టీ ఎస్టీసెల్ నాయకులు సీహెచ్ బీసు, సింహాచలం, పార్టీ మైనారిటీ సెల్ మండల నాయకుడు సువార్తరావు, నాయకులు చినపాత్రుని సాంబమూర్తి, రాజారావు పాల్గొన్నారు.


కొఠియా గ్రామాలకు చేరుకునేందుకు రాళ్ల మార్గంలో ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే, నాయకులు

రాళ్లదారిపై ఏడు కిలోమీటర్లు నడిచి...

రాళ్లదారిపై నడక కష్టమని తెలిసినా ఎమ్మెల్యే వెనుకాడలేదు. గన్‌మెన్, నాయకులతో కలిసి ఏడు కిలోమీటర్ల మేర రాళ్లదారిపై నడిచి కొఠియా గ్రామాలకు చేరుకున్నారు. వారి కష్టాలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే రాకతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషపడ్డారు. మా గ్రామాల్లో మీరు వస్తుంటే జగన్‌మోహన్‌రెడ్డి వచ్చినట్టే ఉందంటూ సంబరపడ్డారు.

ప్రజా సంకల్పయాత్ర క్యాలెండర్ ఆవిష్కరణ

పార్వతీపురం: వైఎస్సార్ సీపీ అధినేత, ప్రతిపక్ష నాయకుడు వై.ఎస్.జగన్ పాదయాత్రకు సంబంధించిన ప్రజా సంకల్పయాత్ర క్యాలెండర్‌ను అరకు పార్లమెంట్ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని తను సీఎం అయిన తరువాత ప్రజలకు సుపరిపాలన అందించేందుకు జగన్ పాదయాత్ర చేస్తున్నారన్నారు. ప్రజా సంకల్పయాత్ర చేసిన దృశ్యాలను క్యాలెండర్‌లో ముద్రించామని తెలిపారు. కార్యక్రమంలో పార్వతీపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త జమ్మాన ప్రసన్నకుమార్, చుక్క లక్ష్మునాయుడు, చుక్క పోలినాయుడు, తీళ్ల శివిన్నాయుడు, బోను రామినాయుడు, గండి శంకరరావు, గొల్లు వెంకటరావు, ఎస్.శ్రీనివాసరావు, చీకటి అనూరాధ, యేగిరెడ్డి భాస్కరరావు, తవిటినాయుడు, నర్సంనాయుడు, గోవిందరావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పాదయాత్ర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

ఆకట్టుకున్న 'త్రీడీ ప్రింటింగ్' ఆవిష్కరణ



వర్క్‌షాప్‌లో వివరిస్తున్న రామ్‌తీజ్ టెక్నాలజీస్ సంస్థ ప్రతినిధి శ్రీహర్ష

విజయనగరంఅర్బన్: పట్టణంలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'త్రీ డీ ప్రింటింగ్'పై శుక్రవారం జరిగిన వర్క్‌షాప్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించిన రామ్‌తీజ్ టెక్నాలజీస్ సంస్థ ప్రతినిధి జీ.శ్రీహర్ష మాట్లాడుతూ, ఇంజినీరింగ్ విద్యార్హతతో ఉద్యోగావకాశాలు పొందాల్సిన విద్యార్థులకు ఇలాంటి వర్క్‌షాపులు దోహదపడతాయన్నారు. నేటి సాంకేతికతకు అనుగుణంగా వివిధ పరికరాలను, విడిభాగాలను త్రీ డీ ప్రింటింగ్ విధానంతో ఎలా తయారు చేయవచ్చో వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డైరెక్టర్ ఎం.శశిభూషణరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి సినిమా

హిమగిరి - ఒక్క క్షణం
సప్తగిరి - 2 కంట్రీస్
లీలామహల్ - ఎంసీఏ
ఎస్‌సీఎస్ - హలో
న్యూపూర్ణ - హలో
ఆదిత్య - జవాన్
కృష్ణా : జుమాంజి

ఐనాక్స్ :
స్క్రీన్ 1: ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయి)
స్క్రీన్ 2: ఒక క్షణం (లవ్ డెస్టినీ)
స్క్రీన్ 3:జుమాంజీ, టైగర్ జిందా హై

గ్యాస్ సమాచారం

గ్యాస్ ఏజెన్సీ	బుక్ చేసిన తేదీ	డెలివరీతేదీ
సాయి హెచ్‌పీ(234523)	06	08
ఎన్‌సీఎస్ (224177)	06	08
ఎన్‌వీఆర్ (225810)	06	08
శ్రీనివాస(224301)	06	08

రైతుబజారు ధరలు (శుక్రవారం)

కూరగాయలు	ధర		
వంగ(తెలుపు)	రూ.22	బంగాళాదుంపలు	రూ.08
వంగ(నలుపు)	రూ.16	అల్లం	రూ.35
టమాటా దేశవాళీ	రూ.11	పచ్చిమిర్చి	రూ.28/38
టమాటా హైబ్రిడ్	రూ. --	వెల్లుల్లి	రూ.36
బెండ	రూ.36	గోరుచిక్కుడు	రూ.22
కాకర	రూ.26	మునక్కాడలు	రూ.65
బీర	రూ.38	కాప్సికమ్	రూ.40
క్యాబేజీ	రూ.20	కీరదోస	రూ.23
పొడుగు చిక్కుడు	రూ.25/30	నక్కదోస	రూ.18
క్యారెట్	రూ.28/35	కంద	రూ.27
దొండ	రూ.26	చామ	రూ.27
బీట్‌రూట్	రూ.28	ఫ్రెంచ్ బీన్స్	రూ.30
ఉల్లిపాయలు	రూ.42	పొటల్స్	రూ...
		ఆగాకరకాయలు	రూ...

పారిశ్రామికవాడలో క్షీణించిన పారిశుద్ధ్యం



రోడ్డుపక్కన కాలుస్తున్న చెత్త



రోడ్డుపై పోగులుగా పడిఉన్న చెత్త

విజయనగరం పూల్‌భాగ్: సారిపల్లి పారిశ్రామికాభివృద్ధి ప్రాంతంలో రోజురోజుకూ పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. ఎక్కడికక్కడే చెత్త,చెదారాలు పేరుకుపోవడంతో కార్మికులు, స్థానికులు ఇక్కట్లు పడుతున్నారు. రోడ్డు పక్కనే చెత్త పోగులు వేయడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. రోడ్డు చిన్నది కావడం పైగా చెత్త పేరుకుపోవడంతో ఇటీవల కాలంలో జరిగిన ప్రమాదాల్లో ఆరుగురు మరణించారు. చెత్త కాల్చడం వల్ల పొగ వెలువడుతోందని, దీంతో శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశ్రామిక వాడను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

బహిరంగ మలవిసర్జనతో అనర్థాలు



రూరల్: గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు



అర్బన్ : పట్టణవీధుల్లో ర్యాలీగా పాల్గొన్న ఎంఆర్ డిగ్రీ విద్యార్థులు

విజయనగరం రూరల్: పట్టణ పరిధిలోని ధర్మపురిలో ఎంఆర్ అటానమస్ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–3 వలంటీర్లు ఓడీఎఫ్‌పై అవగాహన కల్పించారు. రెండో రోజైన శుక్రవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛభారత్, పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, మరుగుదొడ్ల ఉపయోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఆర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి విజయభారతి, ధర్మపురి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ..

విజయనగరంఅర్బన్: పట్టణంలోని మహారాజా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ వలంటీర్లు స్థానిక పెద్దవీధి, ఎరుకులపేట ప్రాంతాల్లో సామాజిక చైతన్య ర్యాలీ నిర్వహించారు.

మరుగుదొడ్ల వినియోగంపై సర్వే, పారిశుద్ధ్యంపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ యూనివర్శిటీ స్థాయి విజేతలు ఎం.సత్యనారాయణ, ఎ.వినీత, ఎం.భార్గవిలను అభినందించారు. జిల్లా ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.నాగమణి, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–1, 2 పీఓలు, వలంటీర్లు పాల్గొన్నారు.

అన్నమయ్య సంగీత పోటీల విజేత లక్ష్మీశైలజ

విజయనగరం అర్బన్: విశాఖలో ఇటీవల 'శ్రీవారికి స్వరార్చన' పేరిట జరిగిన అన్నమయ్య సంకీర్తన పోటీలలో తమ పాఠశాల విద్యార్థి లక్ష్మీ శైలజ విజేతగా నిలిచిందని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ రాజేష్ కోరాడ తెలిపారు. ఈ మేరకు విద్యార్థినిని శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, లక్ష్మీశైలజకు నిర్వాహకులు లక్ష రూపాయల నగదు బహుమతి ఇచ్చారన్నారు. విద్యార్థిని సంస్థ విశాఖ జోన్ ఏజీఎం ఎంవీ సురేష్, విజయనగరం జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి శ్రీనివాసరావు, డీన్లు సత్యనారాయణ, సాయికిషోర్, ఉపాధ్యాయులు అభినందించారు.



విజేతను అభినందిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థ అధికారులు

ఆ బాధ్యత తల్లిదండ్రులదే..

గుర్ల: పదో తరగతి విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని వల్లాపురం హైస్కూల్ హెచ్‌ఎం ఎం.ప్రసాదరావు పేర్కొన్నారు. శుక్రవారం వల్లాపురం హైస్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించడంలో తల్లిదండ్రులదే ప్రముఖ పాత్ర అన్నారు. చదువుపై ఆసక్తి చూపాలనీ, ప్రతీ ఒక్కరూ చదువుకోవాలని భూపాలపురం యూపీ స్కూల్ హెచ్‌ఎం ఎ.పురుషోత్తమరావు పేర్కొన్నారు. తర్వాత విద్యార్థులతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో అప్పలసూరి, సత్యం, రామ్మూర్తి పాల్గొన్నారు.

భూపాలపురంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు →



దళితులపై దాడి చేయడం దారుణం

- దళిత సంఘాల ప్రతినిధులు

విజయనగరం పూల్‌భాగ్: డెంకాడ మండలం మోదవలసలో దళితులపై టీడీపీ నాయకులు దాడి చేయడం దారుణమని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి గోకా రమేష్‌బాబు అన్నారు. గాయపడిన దళితులను కేంద్రాస్పత్రిలో శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దళితులు జన్మభూమి కార్యక్రమానికి వెళ్తుండగా అడ్డుకుని మరీ దాడి చేయడం తగదన్నారు. ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి అనుచరులు గంట్రేటి గణేష్, తదితరులపై దాడి చేశారన్నారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పరామర్శించిన వారిలో దళిత ఐక్య వేదిక అధ్యక్షుడు ఆదాడ మోహనరావు, మాలమహానాడు జిల్లా కార్యదర్శి తెరుపల్లి శ్రీనివాసరావు, గుర్రాపు రాజు, తదితరులు పాల్గొన్నారు.

జమ్ములో 'విద్యా వికాసం' ర్యాలీ



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

విజయనగరం రూరల్: జన్మభూమి – మా ఊరు కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని జమ్ములో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంత్రి రామ్మోహన్ ఆధ్వర్యంలో 'విద్యా వికాసం'పై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ, విద్యా వికాసంతోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చంద్రన్న సంచార వైద్యశాల వైద్యుడు రాజశేఖర్, మిమ్స్ కళాశాల వైద్య విద్యార్థినులు నందిని, కామాక్షిదేవి, ఏఎన్ఎం సత్యవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు కోసమ్మ, గౌతమి, విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

‘చుక్కలనే పూవులతో పెద్ద చెట్టులాగా కనిపిస్తోంది ఆకాశం’



గంగనపల్లె వెంకటరమణ
స్కూల్ అసిస్టెంట్ (తెలుగు),
జెడ్పీహెచ్ఎస్, పి.ఐ.జి. పల్లె,
పుల్లంపేట, వైఎస్ఆర్ కడప జిల్లా

4. వెన్నెల

సామర్థ్యం: 1. అవగాహన- ప్రతిస్పందన

♦ కింది పద్యాలకు ప్రతిపదార్థాలు రాయండి. 4 మార్కులు

సూచనలు:

1. అన్వయక్రమాన్ని పాటిస్తూ, క్రియా పదంతో ముగించినందుకు 1 మార్కు.
2. అన్ని పదాలకు సరైన అర్థాలు రాసినందుకు (సంధి పదాలను విడదీసి రాయాలి) 3 మార్కులు.

1. **సురుచిర తారకా కుసుమ శోభి నభోంగణభూమిc గాలమ న్గరువపు సూత్రధారి జతనంబున దిక్పతికోటి ముందటన్ సరసముగా నటింపcగ నిశాసతి కెత్తిన క్రొత్తతెరcపుc బెం దెర యన నొప్పె సాంధ్య నవదీధితి పశ్చిమ దిక్తటంబునన్**

ప్రతిపదార్థం:

సురుచిర = చాలా అందమైన
తారకా = చుక్కలనే; కుసుమ = పూల చేత
శోభి = అలంకరించిన
నభః + అంగణ భూమిన్ = ఆకాశమనే రంగస్థలం (వేదిక)పై
కాలము + అన్ = కాలమనే
గరువవు = గొప్ప;
సూత్రధారి = సూత్రధారి (దర్శకుడు)
జతనంబున = ప్రయత్న పూర్వకంగా
దిక్పతి కోటి = దిక్పాలకుల సమూహం
ముందటన్ = ముందు (ఎదుట)
సరసముగా = చక్కగా (యుక్తంగా)
నటింపగ = నాట్యం చేయడానికి సిద్ధపడిన
నిశాసతికి = రాత్రి అనే స్త్రీకి
ఎత్తిన = నిలిపిన (పట్టిన)
క్రొత్త = కొత్తదైన; తెరcపున్ = ఎర్రని
పెన్ + తెర = పెద్ద తెర; అనన్ = అన్నట్లుగా
పశ్చిమ దిక్ + తటంబునన్ = పడమటి తీరంలోని (పడమటి దిక్కున)
సాంధ్య = సంధ్యకు సంబంధించిన (సంధ్యాకాలపు)
నవ దీధితి = కొత్త వెలుగు
ఒప్పెన్ = ప్రకాశించింది

♦ **కింది పద్యాలను పాదభంగం లేకుండా పూరించి, భావాలను రాయండి.** 4 మార్కులు

సూచనలు:

1. పాదభంగం లేకుండా పద్యాన్ని పూరించినందుకు (4 × ½) 2 మార్కులు.
2. సరైన భావం రాసినందుకు 2 మార్కులు మొత్తం.

1. ‘దెసలను కొమ్మ లొయ్య .... సముత్సుకాకృతిన్’ అనే పద్యాన్ని పూరించి, భావాన్ని రాయండి.

పద్యం:

దెసలను కొమ్మ లొయ్య నతిదీర్ఘములైన కరంబులన్ బ్రియం బెసcగcగ నూcది నిక్కి రజనీశ్వరుc డున్నతలీలc బేర్చు నా కస మను పేరి భూరుహము కాంత నిరంతర తారకా లస త్కుసుమ చయంబు గోయుటకుకో యనc బ్రాకె సముత్సుకాకృతిన్

భావం: దిక్కులనే కొమ్మలతో, ప్రకాశించే చుక్కలనే పూవులతో పెద్ద చెట్టులాగా కనిపిస్తోంది ఆకాశం. తన పొడవైన చేతులతో ఆ పూవులను అందుకునేందుకా అన్నట్లు చంద్రుడు మిక్కిలి ఉత్సాహంతో విజృంభించాడని ఎర్రన వర్ణించాడు.

సామర్థ్యం : 2. వ్యక్తీకరణ (స్వీయ రచన)

♦ లఘు సమాధాన ప్రశ్నలు. 2 మార్కులు

1. **వెన్నెల పాఠ్యాంశాన్ని రచించిన కవి గురించి రాయండి.**
కవి: ఎర్రా ప్రెగ్గడ (ఎర్రన) కాలం: 14వ శతాబ్దం
రచనలు: భారతంలో అరణ్య పర్వ శేషం, హరివంశం, నృసింహపురాణం,రామాయణం మొదలైనవి.
బిరుదులు: శంభుదాసుడు, ప్రబంధ పరమేశ్వరుడు
శైలి: ఎర్రన రచనలో వర్ణనలు అధికంగా ఉంటాయి. తరువాతి కాలంలోని కవుల వర్ణనకు ఎర్రన వర్ణనలే ప్రేరణనిచ్చాయి.
ఇతర విషయాలు: కవిత్రయంలో మూడవవాడు ఎర్రన. ఈయన గురువు శంకరస్వామి. తల్లిదండ్రులు పోతమాంబిక, సూరనార్యులు. ఎర్రన అద్దంకిని రాజధానిగా చేసుకొని పాలించిన ప్రోలయ వేమారెడ్డి ఆస్థాన కవి.
2. **వెన్నెల పాఠ్యాంశ నేపథ్యాన్ని రాయండి.**
హిరణ్యకశిపుడు వనవిహారం చేసిన సందర్భంలో వసంత రుతువును, సాయం సమయాన్ని, చంద్రోదయాన్ని ఎర్రన వర్ణించాడు. రోజంతా తీవ్రమైన ఎండను ప్రసరింపజేసిన సూర్యుడు ఇంకా ఉష్ణ తాపాన్ని పెంచితే అసుర నాయకుడైన హిరణ్యకశిపుడు సహింపడేమో అన్నట్లు నెమ్మదిగా పక్కకు తొలగిపోయాడు. ఆ తర్వాత ప్రకృతిలో వచ్చిన మార్పులను వర్ణించడమే ఈ పాఠ్యాంశ నేపథ్యం.
3. **కావ్య ప్రక్రియను గురించి రాయండి.**
ఎర్రన రచించిన ‘వెన్నెల’ పాఠ్యాంశం కావ్య ప్రక్రియకు చెందింది. ప్రాచీన తెలుగు సాహిత్య ప్రక్రియల్లో కావ్య ప్రక్రియ ఒకటి. ఇందులో వర్ణనలు ఎక్కువగా ఉంటాయి. కావ్యాల్లో శృంగార, భక్తి, వీర రసాలకు, కథాకథనానికి ప్రాధాన్యం ఉంటుంది. నృసింహ పురాణం, హరివంశం మొదలైనవి ఎర్రన కావ్యాలు.
4. **వెన్నెలను వర్ణించడానికి కవి ఏయే అంశాలను ఎన్నుకున్నాడో తెల్పండి.**
కవిత్రయంలో మూడవ వాడు ఎర్రన. ఈయన తన నృసింహపురాణంలో వెన్నెలను ఎంతో రమణీయంగా వర్ణించాడు. వెన్నెల తెల్లగా ఉంటుంది. కాబట్టి ధవళ వర్ణాన్ని సూచించే పాలసముద్రం, ప్రకాశిస్తున్న చంద్ర బింబం, సరస్సులో విచ్చుకున్న కలువపూలు, చంద్రకాంత శిలలు, అందమైన స్త్రీల చిరునవ్వుల కాంతి అనే అంశాలను ఎన్నుకొని కవి వెన్నెలను వర్ణించాడు.
5. **‘కాటుక గ్రుక్కినట్టి కరవటంబున జగదండభాండ మమరె’ ఈ మాటలు కవి ఏ సందర్భంలో పేర్కొన్నాడో వివరించండి.**
సాయం సంధ్యా సమయంలో ఆకాశంలో దట్టంగా వ్యాపించిన చీకటిని వర్ణిస్తున్న సందర్భంలో కవి ఎర్రన పలికిన మాటలివి. అధికమైన చీకటి కారణంగా కంటికి ఏమీ కనిపించడం లేదు. ఇది ఎట్లా ఉందంటే దిక్కులు, ఆకాశం, భూమి ఒకదానితో ఒకటి కలిసిపోయి, బాగా కాటుక నింపిన భరిణె (కరవటంబు) లాగా విశ్వమంతా నల్లగా ఉందని కవి పేర్కొన్నాడు. కవి ఊహ నిజంగా అద్భుతం.

♦ **మరికొన్ని మాదిరి ప్రశ్నలు**

6. పున్నమి నాటి చంద్రబింబాన్ని చూస్తే చంద్రుడిలో ఏమేమి ఉన్నట్లుగా మీరు అనుభూతి చెందుతారు?
7. పౌర్ణమి నాటి కలువలను చూస్తుంటే మీకు కలిగే ఆనందం ఎలా ఉంటుందో ఊహించి రాయండి.
8. వెన్నెలను చూసిన కలువలు ఎలా ప్రతిస్పందించాయో మీ పాఠం ఆధారంగా రాయండి.
9. చంద్రుడు తన వెన్నెలతో ప్రపంచానికి ఆహ్లాదాన్ని ఎలా కలిగించాడని ఎర్రన వర్ణించాడు?

♦ **మాదిరి వ్యాసరూప సమాధాన ప్రశ్నలు. 5 మార్కులు**

1. వెన్నెల పాఠ్యభాగ సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి. (లేదా)



2. వెన్నెల విస్తరించిన విధానాన్ని మీ సొంతమాటల్లో రాయండి. (లేదా)
3. రాత్రి అనే ఆలోచన రానీయక, చీకటి అనే పేరును విననీయక ఆనంద తరంగాలా విస్తరించిన వెన్నెల విజృంభణను మీ సొంతమాటల్లో రాయండి.

సామర్థ్యం : 3. భాషాంశాలు (పద జాలం)

♦ **కింది పదాలను సొంతమాటల్లో ఉపయోగించి రాయండి.**

1. స్మిత కాంతి = చిరునవ్వుల వెలుగు
ఇంటికి వచ్చిన అతిథులను స్మితకాంతితో పలకరించాలి.
2. దివి = ఆకాశం
సూర్యచంద్రులు దివిలో ప్రయాణిస్తారు.
3. మిక్కుటం = ఎక్కువ
పెద్దనోట్ల రద్దు కారణంగా పేద ప్రజలు మిక్కుటంగా బాధలు పడ్డారు.
4. రజనీకర బింబం = చంద్ర బింబం
పౌర్ణమి నాటి రజనీకరబింబం ఎంతో ఆనందాన్నిస్తుంది.

నానార్థాలు

1. వెల్లి = ప్రవాహం, పరంపర, పాలవెల్లి
2. కుండలి = పాము, నెమలి, వరుణుడు
3. నిట్టవొడుచు = ఉప్పొంగు, విజృంభించు, రోమాంచితమగు

పర్యాయ పదాలు

1. చాడ్పు = విధం, భంగి, రీతి, తీరు
2. వెల్లి = ప్రవాహం, వెల్లవ
3. కైరవం = కలువ, కల్హారం, కుముదం, ఇందీవరం
4. కౌముది = వెన్నెల, చంద్రిక, జ్యోత్స్న
5. చంద్రుడు = ఇందుడు, శశాంకుడు, నిశాకరుడు
6. తమస్సు/తమం= చీకటి, ఆంధ్యం, అంధకారం, ఇరులు

ప్రకృతులు-వికృతులు

1. సంధ్య – సంజ; 2. దిశ – దెస
3. ధర్మము – దమ్మము 4. రాత్రి – రాతిరి
5. నిశ – నిసి 6. గౌరవము – గారవము
7. యత్నము–జతనము 8. చంద్రుడు–చందురుడు

వ్యాకరణాంశాలు

♦ **కింది పదాలను విడదీసి, సంధి పేరు రాయండి**

1. రజనీశ్వరుడు = రజని + ఈశ్వరుడు –సవర్ణదీర్ఘ సంధి
2. చంద్రికాంబోధి = చంద్రిక + అంబోధి –సవర్ణదీర్ఘ సంధి
3. సముత్సుకాకృతిన్ = సముత్సుక + ఆకృతిన్ –సవర్ణదీర్ఘ సంధి
4. దివసేంద్రుడు = దివస + ఇంద్రుడు –గుణ సంధి
5. కాంతోపలంబులు = కాంత + ఉపలంబులు –గుణ సంధి
6. తలమెక్కి = తలము + ఎక్కి –ఉత్వ సంధి
7. చంద్రుడుదయించె = చంద్రుడు + ఉదయించె –ఉత్వ సంధి
8. ఖండమమరె = ఖండము + అమరె –ఉత్వ సంధి
9. దీర్ఘములైన = దీర్ఘములు + ఐన –ఉత్వ సంధి
10. దీరంబైన = దీరంబు + ఐన –ఉత్వ సంధి
11. అత్యంత = అతి + అంత –యణాదేశ సంధి
12. వంటాముదము = వంట +ఆముదము –అత్వ సంధి
13. ఏమనిరి = ఏమి + అనిరి –ఇత్వ సంధి
14. అవ్విధంబున = ఆ + విధంబున –త్రిక సంధి
15. చనదొరు = చనదు + ఒరు –ఉత్వ సంధి

♦ **కింది పదాలకు విగ్రహ వాక్యాలు రాసి, సమాసాలను పేర్కొనండి.**

1. నలుదెసలు = నాలుగు సంఖ్య గల దెసలు –ద్విగు సమాసము
2. సూర్యచంద్రులు= సూర్యుడునూ, చంద్రుడునూ –ద్వంద్వ సమాసము

♦ **కింది పద్యపాదాల్లోని అలంకారాన్ని గుర్తించండి. లక్షణ సమన్వయం చేయండి.**

అభినుతేందు చంద్రికాంబోధి యఖిలంబు నీట నిట్టలముగ నిట్టవొడిచె.
– ఇందులో రూపకాలంకారం ఉంది.
ఇక్కడ వెన్నెల (చంద్రిక) అనే సముద్రము (అంబుధి) నుంచి చంద్రుడు (అభినుత + ఇందు) నిండుగా (నిట్టలముగా) ఆవిర్భవించాడు (నిట్టవొడిచె) అని చెప్పడం జరిగింది. ఉపమేయమైన వెన్నెలకు ఉపమానమైన సముద్రానికి అభేదం చెప్పబడింది. కాబట్టి ఇది రూపకాలంకారం.

పద్యాలు – లక్షణాలు

♦ **తేటగీతి:**

1. ఇది ఉపజాతి పద్యం. నాలుగు పాదాలు ఉంటాయి
2. ప్రతిపాదంలో ఒక సూర్యగణం, రెండు ఇంద్ర గణాలు, మరలా రెండు సూర్య గణాలు వస్తాయి. (సూర్యుడొక్కరుండు, సురరాజులిద్దరు, దినకర ద్వయంబు తేటగీతి)
3. ప్రతిపాదంలో ఒకటో అక్షరానికి నాలుగో గణ మొదటి అక్షరానికి యతి చెల్లుతుంది.
4. ప్రాస నియమం ఉండదు.

♦ **ఆటవెలది:**

1. ఇది ఉపజాతి పద్యం. నాలుగు పాదాలు ఉంటాయి
2. ఒకటి, మూడు పాదాల్లో వరసగా మూడు సూర్య గణాలు, రెండు ఇంద్ర గణాలు ఉంటాయి.
3. రెండు, నాలుగు పాదాల్లో ఐదు సూర్యగణాలే ఉంటాయి. (ఇన గణ త్రయంబు, ఇంద్ర ద్వయంబు హంస పంచకంబు ఆటవెలది)
4. ప్రతి పాదంలో ఒకటో అక్షరానికి నాలుగో గణ మొదటి అక్షరానికి యతి చెల్లుతుంది. యతి లేని చోట ప్రాస యతి ఉంటుంది.
5. ప్రాస నియమం ఉండదు.

‘నాదేశం నశించే పరిస్థితుల్లో నేను జన్మించాను’



మగ్గం వెంకటరమణరావు
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల.





మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో ‘అక్షరాజ్య కూటమి’లోని దేశాలేవి?
1) నార్వే, స్వీడన్, డెన్మార్క్
2) ఇటలీ, జర్మనీ, జపాన్
3) అమెరికా, చైనా, స్పెయిన్
4) రష్యా, ఫ్రాన్స్, బ్రిటన్

2. ‘కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా’ తొలి సమావేశం ఎక్కడ జరిగింది?
1) బీజింగ్ 2) నాన్‌కింగ్
3) షాంఘై 4) పెకింగ్

3. ఇటలీ ఏకీకరణోద్యమంలో కీలక పాత్ర పోషించిన గారీబాల్డీ ఎక్కడ జన్మించాడు?
1) నైస్ 2) టస్కనీ
3) సార్డీనియా 4) వెనిస్

4. ముస్తాఫ కెమాల్ పాషాకు ఉన్న బిరుదు అయిన ‘కెమాల్’ అంటే?
1) వేగు చుక్క 2) పరిపూర్ణుడు
3) రక్షకుడు 4) విమోచకుడు

5. కింది వాటిలో సరైన జత ఏది?
1) హిట్లర్ ఆత్మహత్య -1945
2) ఐక్యరాజ్య సమితి సచివాలయం – న్యూయార్క్
3) ఉదయించే సూర్యుడి భూమి – జపాన్
4) పైవన్నీ సరైనవే

6. అడాల్ఫ్ హిట్లర్ ఎవరి తత్వ సిద్ధాంతాలకు ప్రభావితుడయ్యాడు?
1) హిడెన్‌బర్గ్ 2) ముత్సుహిటో
3) జోసెఫ్ గోబెల్స్ 4) నీషె

7. కింది వాటిలో నల్లమందు యుద్ధాలు ఏయే దేశాల మధ్య జరిగాయి?
1) చైనా – బ్రిటన్
2) జర్మనీ – ఆస్ట్రియా
3) జపాన్ – అమెరికా
4) ఫ్రాన్స్ – ఇటలీ

8. ‘చైనా జాతి పిత’ అని ఎవరిని పిలిచారు?
1) సన్ యెట్ సేన్ 2) చౌ ఎన్ లై
3) చూటే 4) మావో సే టుంగ్

9. రెండో విక్టర్ ఇమ్మానుయేల్ ఏ ప్రాంత పాలకుడిగా కీర్తిగాంచి నిజాయితీపరుడైన రాజుగా ప్రసిద్ధి చెందాడు?
1) సార్డీనియా 2) ఫ్లారెన్స్
3) వెనిస్ 4) సెవాయ్

10. ‘నల్లచేయి’ అనే గుర్తు ఉన్న ‘నరోరా ఒబ్రానా సంస్థ’ ఏ దేశ విప్లవ సంస్థ?
1) బోస్నియా 2) సెర్బియా
3) ఆస్ట్రియా 4) మొరాకో

11. కౌంట్ కవూర్ స్థాపించిన పత్రిక ఏది?
1) పీపుల్స్ అబ్జర్వర్
2) ఇల్ రిసార్జిమెంటో
3) ఇస్క్రా 4) అవంతి

12. ‘మతం లేని రాజ్యం దిక్సూచి లేని నౌక లాంటిది’ అని అన్నదెవరు?
1) మెటర్నిక్ 2) ఆటోవాన్ బిస్మార్క్
3) మొదటి విలియం
4) నెపోలియన్ బోనాపార్టే

13. ఆస్ట్రియా యువరాజు ‘ఆర్చ్‌డ్యూక్ ఫెర్డినాండ్’ను ఎక్కడ హత్య చేశారు?
1) సరాజెవో 2) వార్సా
3) బెర్న్ 4) జెనీవా

14. ఫ్రాన్స్ చక్రవర్తి నెపోలియన్ బోనా పార్టే ‘కంకార్డేట్’ అనే మత ఒప్పందం ఎవరితో చేసుకున్నాడు?
1) పోప్ 10వ లియో
2) పోప్ 6వ అలెగ్జాండర్
3) పోప్ 7వ పయిస్
4) పోప్ 5వ పయిస్

15. వర్సయిల్స్ సంధి సమావేశంలో పాల్గొన్న ఇటలీ ప్రధాన మంత్రి ఎవరు?
1) ఆర్లాండో 2) జార్జ్ క్లెమెన్సో
3) లాయిడ్ జార్జ్ 4) ఉడ్రో విల్సన్

16. ‘యుద్ధం ప్రభువుల జాతీయ పరిశ్రమ’ అని అన్నదెవరు?
1) డాంటన్ 2) మిరాబూ
3) రాబిస్పియర్ 4) లఫాయితే

17. కింది వాటిలో జోసెఫ్ మాజినీ స్థాపించిన సంస్థ?
1) ఎర్ర చొక్కాల దళం
2) నల్ల చొక్కాల దళం
3) తుంగ్ మెంగ్ హుయి విప్లవ సంస్థ
4) యంగ్ ఇటలీ సంస్థ

18. జపాన్‌లో ‘షింటో’ ప్రాచీన మతం. ‘షింటో’ అంటే?
1) విప్లవ భూమి 2) పవిత్ర భూమి
3) దేవతల మార్గం
4) దైవ శాపగ్రస్త దేశం

19. నెపోలియన్ బోనా పార్టే ఏ తేదీన జన్మించాడు?
1) 1769 ఆగస్టు 15
2) 1779 జనవరి 26
3) 1789 మార్చి 19
4) 1766 అక్టోబర్ 14

20. ‘ఆసియా ఆసియావాసులకే’ అనే నినాదం ఏ దేశానిది?
1) జపాన్ 2) చైనా
3) భారత్ 4) శ్రీలంక

21. నెపోలియన్ బోనాపార్టేకి సంబంధించి కింది వాటిలో సరైంది?
1) 1804లో ఫ్రాన్స్ చక్రవర్తిగా అధికారం చేపట్టాడు
2) రెండో జస్టీనియన్‌గా కీర్తి పొందాడు
3) 1815లో వాటర్లూ యుద్ధం చేశాడు
4) పైవన్నీ సరైనవే

22. వ్యాపార నిమిత్తం చైనాలో అడుగుపెట్టిన తొలి ఐరోపావాసులు ఎవరు?
1) బ్రిటిషర్లు 2) ఫ్రెంచ్‌వారు
3) పోర్చుగీస్‌వారు 4) డచ్చివారు

23. నెపోలియన్ బోనాపార్టే ‘భూఖండ విధానం’ ఏ దేశానికి వ్యతిరేకంగా చేపట్టాడు?
1) ప్రష్యా 2) ఇంగ్లండ్
3) రష్యా 3) ఆస్ట్రియా

24. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో 21 డిమాండ్ల పత్రాన్ని జపాన్ ఏ దేశానికి పంపింది?
1) ఇంగ్లండ్ 2) రష్యా
3) ఫ్రాన్స్ 4) చైనా

25. టర్కీ.. నానాజాతి సమితిలో ఎప్పుడు సభ్యత్వం పొందింది?
1) 1932 2) 1934
3) 1936 4) 1938

26. ‘బ్లడ్ అండ్ ఐరన్’ పాలసీ సృష్టికర్త ఎవరు?
1) జోసెఫ్ మాజినీ
2) డాక్టర్ సన్‌యేట్‌సేన్
3) ఆటోవాన్ బిస్మార్క్
4) మూడో నెపోలియన్

27. ‘స్త్రీ సంపూర్ణ వ్యక్తిత్వానికి మాతృత్వం ఎలాంటిదో, సంపూర్ణ వికాసానికి యుద్ధం అలాంటిది’ అని అన్నదెవరు?
1) లెనిన్ 2) స్టాలిన్
3) అడాల్ఫ్ హిట్లర్
4) బెనిటో ముస్సోలినీ

28. నానాజాతి సమితి సచివాలయం కేంద్ర కార్యాలయం ఎక్కడ ఉంది?
1) జెనీవా 2) న్యూయార్క్
3) బెర్లిన్ 4) మాస్కో

29. అడాల్ఫ్ హిట్లర్ స్థాపించిన ‘రహస్య పోలీస్ దళం’ ఏది?
1) రీచ్‌స్టాగ్ 2) థర్డ్ సెక్షన్
3) గెస్టాపో 4) అగ్‌ఫ్యూ

30. నానాజాతి సమితిని ఎప్పుడు స్థాపించారు?
1) 1918 2) 1920
3) 1922 4) 1924

31. ‘ప్రాచ్య విజ్ఞాన కోశం’ అని ఏ దేశాన్ని పిలుస్తారు?
1) శ్రీలంక 2) జపాన్
3) చైనా 4) బర్మా

32. కింది వాటిలో అడాల్ఫ్ హిట్లర్ రాసిన గ్రంథం ఏది?
1) ఏప్రిల్ థీసిస్ 2) మీన్‌కాంఫ్
3) ద స్టడీ ఆఫ్ ఫిజికల్ కల్చర్
4) దాస్ కాపిటల్

33. బెనిటో ముస్సోలిని.. ఫాసిస్ట్ పార్టీని ఎక్కడ స్థాపించాడు?
1) వెనిస్ 2) మిలాన్
3) ఫ్లారెన్స్ 4) రోమ్

34. ‘కార్వోనరీ’ అంటే?
1) సంగీత బృందం 2) గ్రామీణ రైతులు
3) బొగ్గును కాల్చేవారు
4) యుద్ధ ఖైదీలు

35. ‘టర్కీ టర్కులకే’ అనే నినాదం ఇచ్చిందెవరు?
1) ఇస్మత్ ఇనోను
2) ముస్తాఫ కెమాల్ పాషా
3) అలీ ఫతేహ్ ఒక్యార్
4) జెనిటో జారెజ్

36. ఐరోపా ఖండంలో వియన్నా కాంగ్రెస్ సమావేశం ఎప్పుడు జరిగింది?
1) 1815 2) 1817
3) 1819 4) 1821

37. కింది వాటిలో సరైన జత ఏది?
1) ఫ్యూరర్ – అడాల్ఫ్ హిట్లర్
2) ఇల్‌డ్యూస్ – బెనిటో ముస్సోలిని
3) అటాటర్క్ – ముస్తాఫా కెమాల్ పాషా
4) పైవన్నీ సరైనవే

38. పెరల్ హార్బర్ సంఘటన ఏ తేదీన జరిగింది?
1) 1941 డిసెంబర్ 7
2) 1942 డిసెంబర్ 17
3) 1943 ఆగస్టు 16
4) 1944 మార్చి 19

39. ఫాసిస్ట్ పార్టీ చిహ్నాలు ఏవి?
1) సూర్యుడు, నాగలి
2) స్వస్తిక్, నక్షత్రం 3) పావురం, పులి
4) పుల్లల మోపు, గొడ్డలి

40. ‘ఇటలీ జాతీయోద్యమానికి ఆత్మ’ అని ఎవరిని పేర్కొంటారు?
1) మాజినీ 2) గారీబాల్డీ
3) కౌంట్‌కవూర్ 4) విన్సెంట్ జియోబర్టీ

41. చైనాలో ‘బాక్సర్ తిరుగుబాటు’ ఎప్పుడు జరిగింది?
1) 1900 2) 1902
3) 1904 4) 1906

42. కింది వాటిలో సరైన జత ఏది?
1) సమురాయ్ – సైన్యాధికార వర్గం (జపాన్)
2) మంచూ – చైనాను పాలించిన చివరి రాజవంశం
3) 20వ శతాబ్దపు కన్ఫ్యూషియస్ – సన్‌యెట్‌సేన్
4) పైవన్నీ సరైనవే

43. అడాల్ఫ్ హిట్లర్ తన ఆర్థికమంత్రిగా ఎవరిని నియమించాడు?
1) లియోపాల్డ్ 2) బెనెడెట్టి
3) షాట్ 4) వాన్‌రూన్

44. ‘మెయిజీ’ అంటే?
1) విజ్ఞతతో వ్యవహరించడం
2) నియంతృత్వ పాలన
3) పెద్ద భూస్వామ్య వర్గం
4) దైవలోక చక్రవర్తి

45. చౌఎన్‌లై ప్రధానిగా ‘ప్రజా రిపబ్లిక్’ ఏ దేశంలో ఏర్పడింది?
1) జపాన్ 2) చైనా
3) ఆస్ట్రియా 4) ప్రష్యా

46. ఆటోవాన్ బిస్మార్క్ ప్రష్యా చాన్స్‌లర్‌గా ఎప్పుడు పదవీ బాధ్యతలు చేపట్టాడు?
1) 1862 2) 1864
3) 1866 4) 1868

47. ‘నాదేశం నశించే పరిస్థితుల్లో నేను జన్మించాను’ అని అన్నదెవరు?
1) మొదటి విలియం
2) 16వ లూయి 3) ముత్సుహిటో
4) నెపోలియన్ బోనాపార్టే

48. ఫ్రాంక్‌ఫర్ట్ సంధి(1871) ఏయే దేశాల మధ్య జరిగింది?
1) ఫ్రాన్స్, ప్రష్యా 2) ప్రష్యా, డెన్మార్క్
3) డెన్మార్క్, ఆస్ట్రియా
4) ఫ్రాన్స్, ఆస్ట్రియా

49. ‘ఐరోపా జబ్బు మనిషి’ అని ఏ దేశానికి పేరు ఉంది?
1) జర్మనీ 2) టర్కీ
3) ఇంగ్లండ్ 4) ఫ్రాన్స్

50. నెపోలియన్ బోనాపార్టే.. ప్రెస్‌బర్గ్ సంధి ఏ దేశంతో చేసుకున్నాడు?
1) పోలాండ్ 2) డెన్మార్క్
3) రష్యా 4) ఆస్ట్రియా

51. మొదటి ప్రపంచ యుద్ధం జరిగిన కాలం?
1) 1914-1918 2) 1915-1918
3) 1914-1917 4) 1914-1924

52. ‘బ్యాటిల్ ఆఫ్ నేషన్స్’ అని ఏ యుద్ధానికి పేరు?
1) లీప్‌జిగ్ యుద్ధం 2) వాటర్లూ యుద్ధం
3) జీనా యుద్ధం 4) ఆస్టర్లిట్జ్ యుద్ధం

53. ‘పొడెస్టాస్’ అనే ప్రభుత్వ ఉద్యోగుల పాలనలో స్థానిక స్వపరిపాలనా సంస్థలు ఏ దేశంలో పనిచేశాయి?
1) జర్మనీ 2) ఇటలీ
3) ఆస్ట్రియా 4) రష్యా

54. ముస్తాఫ కెమాల్ పాషా మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ఏ ప్రాంతంలో బ్రిటన్ దాడిని తిప్పికొట్టాడు?
1) కైరో 2) అంకారా
3) గాల్లిపోలి 4) టోక్యో

55. నెపోలియన్ బోనా పార్టే.. స్పెయిన్ పాలకుడిగా నియమించిన అతని సోదరుడు ఎవరు?
1) జెరోమ్ 2) టాలీరాండ్
3) ఆర్థర్ వెల్లస్లీ 4) జోసెఫ్

56. రష్యాలో ట్రాట్‌స్కీ, ఆయన అనుచరులు శత్రు సైన్యాలను ఏమని పిలిచేవారు?
1) తెల్ల సైన్యం 2) పచ్చ సైన్యం
3) నీలి సైన్యం 4) ఎర్ర సైన్యం


57. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో భారత్‌లో ఏ స్వాతంత్ర్యోద్యమం కీర్తిగాంచింది?
1) శాసనోల్లంఘనోద్యమం
2) సహాయ నిరాకరణోద్యమం
3) సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమం
4) క్విట్ ఇండియా ఉద్యమం

58. చైనాను పాలించిన మంచూ రాజవంశ ఆఖరి చక్రవర్తి ఎవరు?
1) పుయీ 2) షియోవాంగ్టీ
3) యువాన్ 4) ముత్సుహిటో

59. జపాన్‌ను తన ఆధీనంలోకి తెచ్చుకుని, (1945) మిత్ర రాజ్యాల సైన్యానికి నాయకత్వం వహించింది ఎవరు?
1) జార్జి వాషింగ్టన్ 2) ట్రూమన్
3) జనరల్ మెకార్థర్
4) ఐసన్ హోవర్

సమాధానాలు

1) 2	2) 3	3) 1	4) 2	5) 4
6) 4	7) 1	8) 1	9) 1	10) 2
11) 2	12) 4	13) 1	14) 3	15) 1
16) 2	17) 4	18) 3	19) 1	20) 1
21) 4	22) 3	23) 2	24) 4	25) 1
26) 3	27) 4	28) 1	29) 3	30) 2
31) 3	32) 2	33) 2	34) 3	35) 2
36) 1	37) 4	38) 1	39) 4	40) 1
41) 1	42) 4	43) 3	44) 1	45) 2
46) 1	47) 4	48) 1	49) 2	50) 4
51) 1	52) 1	53) 2	54) 3	55) 4
56) 1	57) 4	58) 1	59) 3	



నాన్నా చెప్పవా

బుల్లెట్ ప్రూఫ్ రహస్యం ఏమిటి?



బుల్లెట్ ప్రూఫ్ గుండా బుల్లెట్ దూసుకుపోకుండా ఒక రకమైన ప్లాస్టిక్ నిరోధిస్తుంది. దానిని లామినేట్ అంటారు. మొదట గాజు, ఆ తరువాత ప్లాస్టిక్, మళ్ళీ గాజు ఇలా బుల్లెట్ ప్రూఫ్ అమరిక ఉంటుంది. ఇది మామూలు అద్దం కంటే మందంగా ఉంటుంది. ఇందులో మధ్యలో వాడే లామినేట్ ప్లాస్టిక్ పాలీ కార్బనేట్ పదార్థం. ఇది చాలా దృఢమైనదే కాక పారదర్శకంగానూ ఉంటుంది. కవచం వంటి ఈ బుల్లెట్ ప్రూఫ్ గుండా బుల్లెట్ (తూటా) దూసుకు రాలేదు. మొదటి పొర అయిన గాజు లోంచి చొచ్చుకుపోయినా ఆ తర్వాత పొర అయిన పాలీ కార్బనేట్ లామినేట్ బుల్లెట్‌కు గల దూసుకుపోయే శక్తిని అడ్డుకుంటుంది. దీంతో బుల్లెట్ లోనికి చొచ్చుకు పోలేదు.

గాలితో పని లేని జీవులున్నాయా?



ఉన్నాయనే అంటున్నారు పరిశోధకులు. మధ్యధరా సముద్ర గర్భంలో ఏ మాత్రమూ ప్రాణ వాయువు జాడ లేని ప్రాంతంలో కొత్త జీవరాశిని పరిశోధకులు కనుగొన్నట్టు సైన్సు డైలీ ప్రకటించింది. చుట్టూ విషపూరిత సల్ఫైడ్‌లు కలిగిన వాతావరణంలో సముద్రగర్భంలో ఉన్న ఆ జీవులను లోరిసీఫెరా వర్గంలో చేర్చారు. ఈ జీవుల్లో జీవక్రియలు బాగానే సాగుతున్నాయని, అంతే కాకుండా ఏ మాత్రమూ ప్రాణ వాయువు లేని ప్రాంతంలో పునరుత్పత్తి ప్రక్రియ కూడా ఈ జీవుల్లో సజావుగా సాగుతోందని గుర్తించారు. ప్రస్తుతం వీటిపై పరిశోధన కొనసాగుతోంది.


రంగులు వేయండి








పైన ఉన్న వింత మనిషి కింద ఉన్న పండు దగ్గరికి రావాలి. దారి చూపండి.



పైన ఉన్న రెండు బొమ్మల మధ్య 15 తేడాలు ఉన్నాయి. గుర్తించండి.

పూరించండి




పైన కొన్ని బాక్సులు, వాటి కింద కొన్ని బొమ్మలున్నాయి. ప్రతి బొమ్మ ఇంగ్లిష్ పేరును మొదటి అక్షరంతో పజిల్‌ను పూర్తిచేయండి. పూర్తయ్యాక వచ్చే పదం మనకు ఎడమవైపున కనిపించే బొమ్మ ఇంగ్లిష్ పదం అవుతుంది. ప్రయత్నించి చూద్దాం!

పూరించండి – జవాబు
Vampire Bat

కింది పజిల్‌లో పక్కన ఉన్న బొమ్మల పేర్లు అడ్డం, నిలువులుగా ఎక్కడ ఉన్నాయో గుర్తించండి.

toy	b	o	a	t	p	p
boat	x	y	b	c	e	o
star	f	s	e	m	a	t
potty	s	t	a	o	c	t
peach	y	a	c	s	h	y
beach	p	r	h	y	o	t

ఎడమవైపున ఉన్న బొమ్మను చూస్తూ కుడివైపున బొమ్మ గీయండి



విజయనగరం | శనివారం | జనవరి | 6 | 2018 సాక్షి

రంగవల్లిక.. లెక్క తేలిందిలా





గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చిత్రపటం ముందు చిన్నారులు, (ఇన్‌సెట్‌లో) ముగ్గులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

సంక్రాంతి సమీపిస్తుంటే వాకిళ్లు రంగులతో మెరిసిపోతాయి. ముగ్గులు వేసే బాలికల సందడితో వీధులు మురిసిపోతాయి. ముగ్గులు ఎవరైనా వేస్తారు.. వాటికి గణితం మేళవిస్తే.. సరదా తీరుతుంది.. గణితంపై పట్టు దొరుకుతుంది. ఆ ఆలోచనతోనే కేఏఎన్ మున్సిపల్ హైస్కూల్ (గాడివీధి)లో శుక్రవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. గణిత ఉపాధ్యాయుడు బెవర శ్రీనివాసరావు సలహాలతో విద్యార్థినులు ఆకర్షణీయమైన రంగవల్లికలను తీర్చి దిద్దారు. చతురస్రం, దీర్ఘచతురస్రం, త్రిభుజం ఆకారాలతోపాటు భిన్నాలు, కోణాలు గుణకారాలను సైతం తెలియజేసేలా ఆకట్టుకునే రీతిలో ముగ్గులను వేశారు. భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటాన్ని సైతం అలవోకగా వేసి అబ్బురపరిచారు. ఆరు నుంచి 10వ తరగతి విద్యార్థినులు పాల్గొన్న ఈ పోటీల విజేతలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరరావు, ఎస్.వేణుగోపాలరావు, గౌరీశంకరరావు తదితరులు ఎంపిక చేశారు. – సాలూరు

'కనక' మహాలక్ష్మి!

- అమ్మవారికి 1.14 కేజీల బంగారు కిరీటం
- దాతల సహకారంతో తయారీ



బంగారు కిరీటం, కాసులపేరు, కర్ణపత్రాలు



ఆభరణాలను దేవాదాయశాఖకు అప్పగిస్తున్న అభివృద్ధి కమిటీ

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి 1.14 కేజీల బంగారు కిరీటాన్ని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ తయారు చేయించింది. దేవాదాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 1.14 కేజీల బంగారు కిరీటంతో బాటు 485.150 గ్రాముల కాసుల పేరు, రెండు కర్ణపత్రాలను దేవాదాయశాఖ అధికారులకు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్, మాజీ ఎంఎల్ఏ గద్దె బాబూరావు ఆధ్వర్యంలో ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఏ గద్దె బాబూరావు మాట్లాడుతూ తనతో బాటు ఎంతో మంది దాతలు సహకారంతో అమ్మవారికి బంగారు కిరీటం చేయించినట్టు చెప్పారు. బంగారు కిరీటం తయారీకి రూ.35 లక్షలు ఖర్చయినట్టు చెప్పారు. అమ్మవారికి ఎంతో కాలంగా ఉన్న 485.150 గ్రాముల బంగారాన్ని దేవాదాయశాఖ అధికారులు తమకు ఇవ్వగా దాంతో కాసుల పేరు, రెండు కర్ణపత్రాలు చేయించామన్నారు. ప్రతి ఆదివారం అమ్మవారి దర్శనానికి వందలాది మంది రానున్నందున ఆ రోజు బంగారు కిరీటం, కాసుల పేరు, కర్ణపత్రాలు అలంకరించాలని ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు చేసిన విజ్ఞప్తికి దేవాదాయ శాఖ అధికారులు లిఖిత పూర్వకంగా ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో అమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు మీసాల వరహాలనాయుడు, దన్నాన రామచంద్రుడు, ఇప్పిలి అనంతం, సూరు కామేష్, కందుల కృష్ణ, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్ఎస్‌వీఎస్ ప్రసాద్, రీజినల్ కార్యాలయం జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి వీవీఎస్‌కే ప్రసాద్, అప్రయిజర్ శ్రీనివాస్, దేవాదాయశాఖ మేనేజర్ జి.శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

శభాష్ చాందిని

- కథ చెప్పినందుకు రూ.50 వేలు
- పారితోషికం అందించిన ముఖ్యమంత్రి
- కురుపాం గురుకులం విద్యార్థిని ప్రతిభ



చాందిని

స్వగ్రామం ఒకప్పుడెలా ఉంది.. ఇప్పుడెలా ఉంది.. ఆ వ్యత్యాసం.. అప్పటి జీవితం కళ్లకు కట్టినట్టు వివరించింది. ముఖ్యమంత్రి ప్రశంసలు పొందింది. రూ.50 వేల పారితోషికం అందుకుంది. ఆ బాలిక పార్వతీపురం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (కురుపాం) విద్యార్థిని పాలక చాందిని. పదో తరగతి చదువుతున్న చాందిని బొబ్బిలిలో శుక్రవారం జరిగిన ముఖ్యమంత్రి సభలో పాల్గొంది. స్వగ్రామం.. తన కుటుంబం గురించి కథ రూపంలో చెప్పింది. తాత జీవించిన రోజులు, నేటికీ ఉన్న తేడాను కళ్లకు కట్టినట్టు కథగా చెప్పడంతో ముగ్ధుడైన చంద్రబాబు ఆమెను అభినందించి వేదికపై ఘనంగా సన్మానించి రూ.50 ల ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. తమ పాఠశాల విద్యార్థిని ముఖ్యమంత్రి ప్రశంసలు పొందడం ఆనందంగా ఉందని ప్రిన్సిపల్ డి.లక్ష్మణరావు, వైస్ ప్రిన్సిపల్ అప్పలనాయుడు తెలిపారు. –:పార్వతీపురం

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

విజయనగరం పూల్‌బాగ్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్కిల్ ఇండియా శిక్షణలో భాగంగా దీన్‌దయాల్ ఉపాధ్యాయ, కౌసల్య యోజన డీడీయూ–జీకేవై పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షన ఇవ్వనున్నట్టు డీడీయూ –జీకేవై సంస్థ ప్రతినిధి బి.దుర్గారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా 90రోజుల నైపుణ్య శిక్షణ కార్యక్రమం, ఓరియెంటల్ స్కిల్స్, సేఫ్టీ సర్వీసెస్ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తారని తెలిపారు. విజయనగరం, జమ్మునారాయణపురం, పెట్రోలు బంకు సమీపంలో షరోన్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఎలక్ట్రికల్, వెల్డింగ్, ప్లంబింగ్, సెల్‌ఫోన్ మరమ్మతులు తదితర విభాగాల్లో 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు పదో తరగతి పాస్, ఫెయిలైన అభ్యర్థులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. క్షణ కాలంలో ఉచితభోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తోపాటు స్థానికంగా నియామకాలు జరపనున్నట్టు తెలిపారు. వివరాలకు 7989316281, 8897131141 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పైడితల్లి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పైడితల్లి ఆలయ ఈఓ భానురాజా

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి ముఖ చిత్రంతో కూడిన క్యాలెండర్‌ను శుక్రవారం సాయంత్రం మూడులాంతర్ల వద్ద ఉన్న చదురుగుడిలో ఆలయ ఈఓ భానురాజా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఖ్యాతి దశదిశలా వ్యాప్తి చెందాలనే సత్‌సంకల్పంతో ధనలక్ష్మీ జ్యూయలర్స్ అధినేత శ్రీరామ్ ఏటా అమ్మవారి క్యాలెండర్లను భక్తులకు అందజేస్తున్నారన్నారు. దాతలు మరింతగా ముందుకు వచ్చి అమ్మవారి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

కార్యక్రమంలో ఆలయ సూపర్‌వైజర్లు రామారావు, అప్పలనాయుడు, వేద పండితులు శంబరి శంకరం, రాజేష్, పాపారావు, రమణ పాల్గొన్నారు.

సీఎం సభకొస్తేనే పెట్టుబడి నిధి



బలిజిపేటలో మహిళల రాకకోసం ఏర్పాటుచేసిన బస్సు

బలిజిపేట: డ్వాక్రా మహిళల ఖాతాల్లో మూడో విడత పెట్టుబడి నిధి డబ్బులు జమ కావాలంటే బొబ్బిలిలో నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సభకు హాజరుకావాలని హెచ్చరికలు జారీ కావడంతో మహిళలు బస్సులు ఎక్కినట్టు సమాచారం. బొబ్బిలిలో శుక్రవారం సీఎం చంద్రబాబు సభకు మహిళలను భారీగా తరలించేందుకు గ్రామాలలో ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. అప్పటికి ఎవరు ముందుకు రాకపోవడంతో మహిళా సంఘాల ప్రతినిధులతో హెచ్చరికలు జారీ చేయించి తీసుకెళ్లినట్టు సమాచారం.

తోటపల్లి భూ సేకరణకు రైతులతో భేటీ

బలిజిపేట: తోటపల్లి కాలువ భూసేకరణ నిమిత్తం రైతులతో తోటపల్లి కాలువ అధికారులు, మండల రెవెన్యూ శాఖాధికారులు శుక్రవారం భైరిపురం, వంజరంపేట, అంపావల్లి, జనార్దనపురం గ్రామాల్లో సమావేశాలు నిర్వహించారు. నాలుగు గ్రామాలకు తోటపల్లి కాలువ నిర్మాణం జరగనున్నందున కాలువకు అవసరమైన భూసేకరణ కసరత్తు నిర్వహించారు. వచ్చే ఖరీఫ్‌కు సాగునీరు అందించేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ వివరాలు సేకరిస్తున్నట్టు తోటపల్లి కాలువ భూసేకరణ శాఖ డీటీలు దుర్గాప్రసాద్, ఆదిబాబులు తెలిపారు. అంపావల్లికి 11.34 ఎకరాలు, జనార్దనపురానికి 11.52 ఎకరాలు, భైరిపురానికి 5.15 ఎకరాలు, వంజరంపేటకు 64 సెంట్ల భూమి అవసరమైనందున రైతులతో సమావేశమై వివరాలు తీసుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ ఇనస్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ కె.రమేష్, సర్వేయర్లు లింగమూర్తి, శ్రీనివాస్, పార్వతీశం, బలిజిపేట సర్వేయర్ వెంకటరమణ, ఆర్ఐ రామకృష్ణంనాయుడు, వీఆర్వో నారాయణస్వామి, రైతులు పాల్గొన్నారు.

నేడు సారిపల్లి ట్రస్టు అభివృద్ధి పనులప్రారంభం

పార్వతీపురం:

సారిపల్లి ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్టు ట్రస్టు ఏడీఎం జె.రామారావు, మేనేజర్ పి.సూర్యారావు తెలిపారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ సరస్వతీ డీఆర్ఎం సారిపల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దాలి మృత్యుంజయరావు సమకూర్చిన నిధులతో కుసుమగుడ్డి వీధిలోని ధ్యాన మందిరంలో చిన్నారులకు ఏర్పాటు చేసిన గ్రంథాలయం, ఆట వస్తువులు, కేపీఎం పాఠశాలలో నాలుగు అదనపు తరగతి గదులు, క్రీడా మైదానం, ఎస్‌వీడీ కళాశాలలో ఆధునికీకరించిన కెమిస్ట్రీ, ఫిజిక్స్, ప్రయోగశాలలను ప్రారంభిస్తారన్నారు.

హరికథా గాన గంధర్వుడు ఆదిభట్ల

- తిథుల ప్రకారం 73వ వర్ధంతి నేడు



ఆదిభట్ల నారాయణదాసు



పడాల కల్యాణీ యాదవ్, హరికథా కళాకారిణి, విజయనగరం

విజయనగరం టౌన్: కష్టపడి కథ నేర్చుకోవాలి. సమకాలీన అంశాలను చేర్చుకోవాలి. ఆసక్తికరంగా ఆలపించాలి. అదే హరికథా గానం.. సకల కళల సమాహారం. హరికథ అంటే చాలు.. ఆదిభట్ల వారు గుర్తొస్తారు. హరికథా పితామహుడైన ఆదిభట్ల నారాయణదాసు విజయనగరం మహారాజా సంగీత, నృత్య కళాశాల తొలి ప్రిన్సిపల్‌గా పనిచేశారు. తిథుల ప్రకారం శనివారం ఆయన వర్ధంతి కావడంతో సినీనటి, హరికథా కళాకారిణి పడాల కల్యాణీ యాదవ్ టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో ఈ నెల 12 వరకూ ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

పసి ప్రాయంలోనే ప్రతిభ

హరికథా పితామహునిగా పేరొందిన ఆదిభట్ల నారాయణదాసు 1864 ఆగస్టు 31న బొబ్బిలి తాలూకా అజ్జాడ గ్రామంలో జన్మించారు. పదేళ్లకే ఘంటం పట్టుకుని తాళపత్ర గ్రంథాలను రాయగలిగే నేర్పును సంపాదించారు. ఆయన పూర్తిపేరు సూర్యనారాయణదాసు. ముద్దుపేరు సూరన్న. పద్నాలుగేళ్ల వయసులో ఆంగ్లంపై పట్టు సంపాదించేందుకు విజయనగరం వచ్చారు.

ఆ కాలంలో ప్రముఖుల మహబత్‌ఖాన్, పప్పు వెంకన్న, వీణా వెంకటరమణ దాసు, కలిగొట్ల కామరాజు తదితరుల దీవెనలు దాసుకు మెండుగా లభించాయి. ఓసారి మద్రాసు నుంచి కుప్పుస్వామి నాయుడు అనే ప్రముఖుడు విజయనగరం వచ్చి కానుకుర్తి హనుమంతరావు ఇంటి వద్ద హరికథ చెప్పారు. అది చూసిన నారాయణదాసు ఎంతో స్ఫూర్తి పొందారు. 19 ఏళ్ల ప్రాయంలో నాయుడు వద్ద హరికథ మెలకువలు నేర్చుకుని ధ్రువచరిత్ర యక్షగాన ప్రబంధాన్ని స్వయంగా రాసి అన్న సీతారామయ్య ఆశీర్వాదంతో వేణుగోపాలస్వామి మఠంలో తొలిసారిగా హరికథ చెప్పారు. విజయనగరం మహారాజా సంగీత కళాశాలకు ఆయన కొంత కాలం ప్రధాన అధ్యక్షునిగా పనిచేసిన ఆయన 1945 జనవరి 2వ తేదీన కన్నుమూశారు. కానీ ఆయన వర్ధంతిని తిథుల ప్రకారం నిర్వహిస్తుంటారు.

తరలి రావాలి

ఆదిభట్ల నారాయణదాసు 73వ వర్ధంతిని పురస్కరించుకుని శ్రీ ఆధిభట్ల శ్రీకళాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 12 వరకూ పలు హరికథలు, పుస్తకావిష్కరణలు, నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సినీ సంగీత దర్శకుడు కోటి ముఖ్య అతిథిగా వెన్‌లాక్ లైబ్రరీలోని ఆదిభట్ల విగ్రహానికి శనివారం నివాళులర్పిస్తారు. అనంతరం టిటీడీ ఆవరణలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆదిభట్ల ఆరాధకులంతా కార్యక్రమాలకు హాజరై విజయవంతం చేయాలి.

– పడాల కల్యాణీ యాదవ్, హరికథాకళాకారిణి,

ప్రజా సంకల్ప యాత్ర

మనవడ్ని చూసినాం.. చాలు



'మా లాంటి వాళ్ల కోసం మా మనవడు (వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి) ఎండల్లో నడిసొస్తాండా డంటే చూడాలని వచ్చినాం. ఆయన్ను చూసినాం. మా బాగోగులు అడిగినాడు. సొంత బిడ్డలా మాట్లాడినాడు. పెద్దాయన్ను (వైఎస్ రాజశేఖరరెడ్డి)ని దగ్గర నుంచి చూసి నట్లుండాది. మా మనవడు అధికారంలోకి రాగానే ముస లోళ్లకంతా నెలకు రూ.2వేల పింఛన్ ఇస్తామన్నాడు. ఊరూ రా ఇదే విషయం చెబుతాం. అందరూ దీవిస్తా ఉండాం. మా మనవడు కచ్చితంగా సీఎం అవుతాడు..' అంటూ కుర బపల్లెకు చెందిన వృద్ధులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా పుంగనూరు నియోజక వర్గంలోని గాండ్లపల్లె నుంచి పాదయాత్రగా బయలుదేరిన జననేత అక్కడే ఉన్న వృద్ధుల్ని కలిశారు. ఆప్యాయంగా పలకరించి వారి బాగోగులు అడగడంతో వృద్ధులు ఉప్పొంగిపోయారు. – చిత్తూరు అర్బన్



గాండ్లపల్లెలో రైతులు ప్రేమగా చుట్టిన తలపాగాతో జననేత జగన్‌మోహన్‌రెడ్డి

మాఫీ లేదు..పెట్టుబడీ లేదు



సాక్షి, చిత్తూరు : ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం చిత్తూరు జిల్లా సదుం మండలం గాండ్లపల్లెలో వరి రైతు సుధాకర్‌తో జననేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడారు. రైతుతో కలిసి ధాన్యం తూర్పారబట్టారు. అనంతరం అన్నదాత కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏం అడిగారంటే..

జగన్: ఈ వరి ధాన్యం ఏ రకం?
రైతు: సోనామసూరి సార్
జగన్: ఎకరాకు ఎంత ఖర్చవుతుంది?
రైతు: రూ.30 వేల వరకు అవుతుందన్నా..
జగన్: ఎంత దిగుబడి వస్తుంది?
రైతు: 25 బస్తాల వరకు..
జగన్: ఖర్చులు పోను ఎంత మిగులుతుంది?
రైతు: ఏం మిగలట్లేదు సార్. 75 కేజీల బస్తా రూ.1000. ఇంకా రూ.5 వేలు చేతి నుంచే పడుతోంది. పాడి ఉండబట్టి ఇల్లు గడుస్తోంది.
జగన్: బ్యాంకులో ఎంత రుణం ఉంది? అప్పు మాఫీ అయ్యిందా?
రైతు : రూ.1లక్ష దాకా అప్పు ఉంది. ఒక్క రూపాయీ మాఫీ కాలేదు సార్. చంద్రబాబు నాయుడు మోసం చేసినాడు. బ్యాంకు నుంచి రెండు రోజుల కొక సారి వడ్డీ అయినా కట్టాలని ఫోన్ వస్తా ఉండాది. పెట్టుబడులు చూసుకుందుమా..? అప్పులు కట్టుకుందుమా?. ఆ మహానుభావుడు వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్నపుడు రూ.50 వేల దాకా మాఫీ అయ్యింది
జగన్: పాలలో అయినా మిగులుతోందా?
రైతు: ఆడికాడికి సరిపోతా ఉండాది సార్..
జగన్: పాలు లీటర్‌కు రూ.4 రాయితీ ఇస్తామని హామీ ఇచ్చాం తెలిసిందా?
రైతు: తెలిసింది సార్. బాగుంది. పాలపై రాయితీ ఇస్తే చాలా మంచిది. రైతు భరోసా కింద రూ.12,500 ఇస్తారని కూడా తెలిసింది.



కదిలిన జగన్ సైన్యం



ఆనంద క్షణం..



అదిగదిగో అన్న..



చెల్లెమ్మ అభివాదం..



జగనన్న అభిమానం..



రాజన్న బిడ్డను చూడాలని..



జనకెరటం : చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలోని సదుంలో జరిగిన బహిరంగ సభకు తరలివచ్చిన అశేష జనం

జన ఉత్సాహం

గుండె నిండా సంకల్పం..
లక్ష్య సాధనపై పట్టుదల..
ప్రజలతో మమేకమవ్వాలనే
బలమైన కాంక్ష..
ఎంచుకున్న మార్గంపై విశ్వాసం..
వెంట అనుసరిస్తున్న వేలాది జనం..

.. ఇవీ వైఎస్సార్‌సీపీ అధినేత..విపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నవ్యోత్సాహంతో పాదయాత్రలో ముందుకు నడిపిస్తున్న అంశాలు.. మొండైన ఆత్మవిశ్వాసంతో అలుపెరుగని ఆయన అడుగులు రాష్ట్ర చరిత్రను ప్రభావితం చేస్తున్నాయి. ఉదయం తొలి అడుగు పడింది మొదలు చీకటి పడ్డాక బస చేరేవరకూ జనం మధ్యే ప్రస్థానం.. రాజన్న వారసత్వంగా పుణికిపుచ్చుకున్న చెరగని చిరునవ్వు.. సామాన్యుడ్ని అక్కున చేర్చుకునే ప్రేమానురాగం ఈ సంకల్ప సూరీడి విశిష్టతలు. ఇవి చూసే చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గ పల్లె ప్రజలు తమ నాయకుడొచ్చాడని సంబర పడుతున్నారు.. ప్రేమతో అభిమానాలు కురిపిస్తున్నారు.

రైతు బిడ్డగా..



తలపాగా ఇలా చుట్టాలి..



నవరత్నాలు తెస్తా : అక్కాచెల్లెమ్మలకు భరోసా ఇస్తున్న జననేత



అధైర్యపడొద్దు అండగా ఉంటా..



నేనున్నానని : దివ్యాంగుడికి ధైర్యంచెబుతూ..

అభిమానం తోడుగా..



తాత కష్టం వింటున్న మనుమడు

Praja Sankalpa Yaatra

అనురాగ హారతి



గాండ్లపల్లెలో హారతి పడుతున్న అక్కాచెల్లెమ్మలు

ఆత్మీయ సెల్ఫీ



జగనన్నతో సెల్ఫీ తీసుకుంటున్న చెల్లెమ్మ

చిరు కానుక



యాదవ సంఘం నాయకుల కానుక

విన్నపాలు



కందూరు క్రాస్ వద్ద అక్కాచెల్లెమ్మల వినతి

మనువడి ఆప్యాయత



గాండ్లపల్లెలో తాతయ్యను పలకరిస్తూ..

దివ్యమైన భరోసా



సదుంలో దివ్యాంగుడితో మాట్లాడుతూ..